
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5




కృష్ణా జిల్లా వార్తలు

శనివారం 14 డిసెంబరు 2024

నేడు జిల్లాకు సీఎం చంద్రబాబు

● దోకిపర్రు, పోరంకిలో పర్యటన



మచిలీపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. గుడ్లవల్లేరు మండలం డోకిపర్రుకు సాయంత్రం 4.00 గంటలకు హెలీకాప్టర్‌లో చేరుకుంటారు. 4.10 గంటలకు డోకిపర్రులోని శ్రీభూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అనంతరం సాయంత్రం 5.10 గంటలకు తిరిగి హెలీకాప్టర్‌లో బయలుదేరి విజయవాడ ఎయిర్‌పోర్టుకు వెళ్తారు. 5.40 గంటలకు పోరంకిలోని మురళీ రీసార్ట్‌కు రోడ్డు మార్గం ద్వారా చేరుకుంటారు. సాయంత్రం 6.00 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు అక్కడ జరిగే ఎన్టీఆర్ వజ్రోత్సవం వేడుకల కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి 8.30 గంటలకు రోడ్డుమార్గం ద్వారా ఉండవల్లిలోని తన నివాసానికి బయలుదేరి వెళతారు.

ఉప్పునీటి ముప్పు

పంట పొలాలను ముంచేస్తున్న సముద్రపు నీరు

- కొట్టుకుపోయిన న్యూకోన డ్రైనేజీ అవుట్‌ఫాల్ స్లూయిస్‌గేట్లు
- ఈ ఖరీఫ్ సీజన్‌లో రెండు సార్లు వరినాట్లు వేయాల్సిన దుస్థితి
- మచిలీపట్నం మండలంలో 12 గ్రామాల్లోని రైతులకు తప్పని అవస్థలు



ధ్వంసమైన న్యూకోన డ్రైనేజీ అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు

6లో

గౌతంరెడ్డి ఇంట్లో పోలీస్ సోదాలు

విజయవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సత్యనారాయణపురంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గందూరి ఉమామహేశ్వరశాస్త్రిపై సుపారీ గ్యాంగ్‌తో హత్యాయత్నం చేయించిన వైసీపీ నేత గౌతంరెడ్డి ఇంట్లో ఏడీసీపీ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. ఈ కేసులో గౌతంరెడ్డి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా ఎదురుదెబ్బ తగిలింది. హైకోర్టు బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేయడంతో గౌతంరెడ్డి నగరం నుంచి పారిపోయాడు. ఇంట్లోనే ఉన్నట్టు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మొత్తం ఇంటిని తనిఖీ చేయగా అతడి ఆచూకీ లభించలేదు. కోర్టులో పిటిషన్ డిస్మిస్ అయినప్పటి నుంచి సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేశాడు. అతడిని పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

చంద్రబాబు : ఏమ్మా బాగున్నారా.. ఏం చదువుతున్నారు?

విద్యార్థినులు : బాగున్నాం సార్.. పదో తరగతి చదువుతున్నాం సార్

చంద్రబాబు : ఎక్కడి నుంచి వచ్చారు

విద్యార్థినులు : నున్న జెడ్పీ హైస్కూల్ నుంచి వచ్చాం సార్

చంద్రబాబు : త్వరలో పబ్లిక్ పరీక్షలు ఉన్నాయి... భయం వేయడం లేదా?

విద్యార్థినులు : ఏమాత్రం భయం లేదు సార్.. మా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు పెట్టి చదివిస్తున్నారు సార్

చంద్రబాబు : శభాష్.. ఆత్మవిశ్వాసం విజయానికి చిహ్నం. ఆల్ ద బెస్ట్

విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ విడుదల కార్యక్రమంలో భాగంగా స్టేడియంలో 'పది సూత్రాలు ఒక విజన్' పేరుతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సందర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు విద్యార్థినులతో కొద్దిసేపు ముచ్చటించారు..



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

శభాష్.. ఆల్ ద బెస్ట్

'స్వర్ణాంధ్ర' స్టాల్ వద్ద పదో తరగతి విద్యార్థినులతో సీఎం చంద్రబాబు

కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులకు అభినందనలు

విజన్ డాక్యుమెంట్‌పై జిల్లా ప్రజాప్రతినిధుల సంతకాలు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) ఎగ్జిబిషన్‌లో ఈ స్టాల్‌ను పదో తరగతి విద్యార్థినులు గాజుల సంధ్య, పానకాల భవ్యశ్రీ, జ్ఞానప్రసూన ఏర్పాటు చేశారు. వీరిలో సంధ్య, భవ్యశ్రీ నున్న జెడ్పీ హైస్కూల్‌లో చదువుతుండగా జ్ఞానప్రసూన పటమట జీడీఈటీ మున్సిపల్ హైస్కూల్‌లో చదువుతోంది. స్టాల్‌ను సందర్శించిన సమయంలో విద్యార్థినులతో చంద్రబాబు మాట్లాడారు. విద్యార్థినులు పదో తరగతి చదువుతున్నారని తెలుసుకుని, వచ్చే ఏడాది మార్చి 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవుతున్నారని చంద్రబాబు వారిని ఆరా తీశారు. పరీక్షలకు బాగా ప్రిపేర్ అవుతున్నామని, పాఠశాలలో ఉపాధ్యాయులు తమకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారని విద్యార్థినులు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులతోనూ మాట్లాడి విద్యార్థినులను పరీక్షలకు ఎలా సన్నద్ధం చేయిస్తున్నారో తెలుసుకున్నారు.

స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం బాగా పనిచేసిందని సీఎం చంద్రబాబు ప్రశంసించారు.

జిల్లా యంత్రాంగానికి సీఎం ప్రశంసలు

రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజాప్రతినిధులు, ప్రజలు తరలివచ్చినప్పటికీ ఎవ్వరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారంటూ అభినందించారు. విజన్ డాక్యుమెంటులోని పది సూత్రాల దార్శనికతను ప్రతిబింబించేలా స్టాళ్లను ఏర్పాటు చేయడం, ప్రణాళిక ప్రకారం పార్కింగ్ ఏర్పాట్లు చూడటం వంటి వాటిని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. జిల్లా అధికారులను మెచ్చుకున్నారు.

స్వర్ణాంధ్రలో జిల్లా నేతల సందడి

స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, బొండా ఉమామహేశ్వరరావు, యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, శ్రీరాం తాతయ్య, కొలికలపూడి శ్రీనివాస్, తంగిరాల సౌమ్య, వర్ల కుమార్ రాజా, మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణ ప్రసాద్‌తోపాటు స్వచ్ఛాంధ్ర మిషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి తదితరులు పాల్గొన్నారు. వీరంతా విజన్ డాక్యుమెంట్‌పై సంతకాలు చేశారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ ఒక చారిత్రక ఘట్టంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. ప్రాంగణానికి విచ్చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆయన స్వాగతం పలికారు. వారిద్దరితో కలిసి విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరచిన పది సూత్రాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంపన్నమైన, ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దటమే విజన్ డాక్యుమెంట్ ప్రధాన ఉద్దేశమన్నారు. మిగతా 6లో..



స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, కలెక్టర్ లక్ష్మీశ

నీటి సంఘాల ఎన్నికలకు వేళాయె!

నేటి ఉదయం 8 గంటల నుంచి ప్రక్రియ ప్రారంభం



- జిల్లాలో 2,317 ప్రాదేశిక నియోజకవర్గాలు
- 209 నీటి వినియోగదారుల సంఘాలు
- జిల్లాలో మొత్తం 3,11,180 మంది ఓటర్లు
- 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు

జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యే ఈ ప్రక్రియ సాయంత్రం ఐదు గంటలకు పూర్తికానుంది. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 209 మంది మండలస్థాయి అధికారులను కలెక్టర్ నియమించారు వీరికి ఆయా గ్రామ సచివాలయాల సిబ్బంది సహాయకులుగా సేవలు అందించనున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు శనివారం జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2,317 నీటి వినియోగదారుల ప్రాదేశిక నియోజకవర్గాలు ఉన్నాయి. 209 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు 209 మంది మండల స్థాయి అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా నియమించారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు గాను ఆయా గ్రామాల పరిధిలోని సచివాలయ సిబ్బందిని ఎన్నికల అధికారులకు సహాయకులుగా నియమించారు. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన ఈ ప్రక్రియ సాయంత్రం ఐదు గంటలకు ముగియనుంది.

అంతా నామినేషన్ పద్ధతిలోనే..

జిల్లాలోని 25 మండలాల్లో 2,317 ప్రాదేశిక నియోజకవర్గాల్లో 3,11,180 మంది ఓటర్లుగా ఉన్నారు. వీరిలో నుంచి 209 నీటి వినియోగదారుల సంఘాలకు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎవరు ఉండాలనే అంశంపై రెండు రోజులుగా కూటమి నాయకుల మధ్య చర్చలు సాగాయి. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు లేదా రైతులను నీటి వినియోగదారుల సంఘాలకు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎంపిక చేయాలనే అంశంపై శుక్రవారం రాత్రి శాసనసభ్యులు, కూటమి నాయకులు ఒక నిర్ణయానికి వచ్చారు. పేర్లను ఖరారు చేశారు.

ఎన్నిక ప్రక్రియ ఇలా..

జిల్లాలోని 2,317 నీటి వినియోగదారుల ప్రాదేశిక నియోజకవర్గాల్లోని ఓటర్లు శనివారం ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటలలోపు పోలింగ్ కేంద్రాల వద్ద జరిగే సమావేశానికి హాజరుకావాల్సి ఉంది. తొమ్మిది నుంచి 9.15 గంటల వరకు నీటి వినియోగదారుల సంఘాల ఏర్పాటుకు సంబంధించిన ఆవశ్యకతను అధికారులు వివరిస్తారు. 9.15 నుంచి 9.45 వరకు చేతులెత్తే పద్ధతిలో ప్రాదేశిక నియోజకవర్గాలకు సభ్యులను ఎన్నుకునే ప్రక్రియను నిర్వహిస్తారు. ఎన్నికైన సభ్యులంతా జిల్లాలోని 209 నీటి వినియోగదారుల సంఘాలకు ప్రెసిడెంట్, వైస్‌ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లుగా పోటీ చేసే వారి నుంచి 9.45 గంటల నుంచి 10.15 గంటల వరకు నామినేషన్‌లను స్వీకరిస్తారు. 10.15 గంటల నుంచి 10.30 గంటల వరకు నామినేషన్‌ల పరిశీలన ఉంటుంది. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లను తెలుగు అక్షరమాల క్రమంలో ప్రకటిస్తారు. ప్రెసిడెంట్, వైస్‌ప్రెసిండెంట్ పదవుల కోసం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుంది. అనంతరం ఎన్నికల ఫలితాలను వెల్లడిస్తారు. అయితే ఈ ప్రక్రియ ఏమీ లేకుండానే నామినేషన్ పద్ధతిన నీటి వినియోగదారుల సంఘాలకు మిగతా 6లో..

పేర్ని ఎక్కడ?

పీడీఎస్ బియ్యం మాయం కేసులో ముందస్తు బెయిల్‌కు పేర్ని సతీమణి పిటిషన్

- వైసీపీ రైతు ధర్నాలో కనిపించని నాని, ఆయన కుమారుడు
- అరెస్టు భయంతోనే అజ్ఞాతంలోకి అంటూ సోషల్ మీడియాలో చర్చ



మచిలీపట్నం, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్ బియ్యం మాయం కేసులో చిక్కుకున్న మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని ఎక్కడ? అంటూ సర్వత్రా చర్చ జరుగుతోంది. వైసీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ పిలుపు మేరకు రైతు సమస్యలపై వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం మచిలీపట్నంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వైసీపీ అధికారం కోల్పోయాక తొలిసారిగా ఆ పార్టీ నాయకులు రోడ్డుపైకి వచ్చారు. జిల్లా అధ్యక్షుడి హోదాలో ఉన్న పేర్నినాని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో మచిలీపట్నం నియోజకవర్గం నుంచి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన పేర్ని నాని కుమారుడు పేర్ని కిట్టు ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. మచిలీపట్నం మండలం పొట్లపాలెంలో పేర్నినానికి చెందిన గోడౌన్ నుంచి 187 టన్నుల పీడీఎస్ బియ్యం మాయం కావడంపై పౌరసరఫరాలశాఖ అధికారులు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పేర్ని నాని భార్య పేర్ని జయసుధపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం శుక్రవారం కోర్టులో పేర్ని నాని భార్య జయసుధ పిటిషన్ కూడా వేశారు. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టించిన వారిపై పీడీ యాక్టు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో పీడీఎస్ బియ్యం మాయం కేసులో ఇరుక్కున్న పేర్ని నాని గత రెండు, మూడు రోజులుగా కనిపించడంలేదు. ఈ అంశంపై సోషల్ మీడియాలో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది.

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు డీజీపీఎస్ రోవర్లు!

6లో



బైపాస్ పనులు ఆగిన ప్రాంతం

పెద్ద స్కెచ్చే వేశారు!?

రెండేళ్ల కిందట మూతపడిన ల్యాంకో పవర్ ప్రాజెక్టు

- దీనికి ఇప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందట..
- డ్యామేజీ కింద రూ.12 కోట్లు ఇవ్వాలని ఎన్‌హెచ్‌కు ల్యాంకో సరికొత్త ప్రతిపాదన
- అసలు పనిచేయని ప్రాజెక్టుకు డ్యామేజీ ఏమిటని రైతుల సూటి ప్రశ్న

ప్రజాధనం కొట్టేయడానికి పెద్ద స్కెచ్చే వేశారు. రెండేళ్ల కిందట మూతపడిన ల్యాంకో పవర్ ప్రాజెక్ట్ విద్యుత్ ఉత్పత్తే జరగటం లేదు. కానీ విజయవాడ వెస్ట్ బైపాస్ కోసం ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడి వల్ల విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయం కారణంగా ల్యాంకో సంస్థకు డ్యామేజీ వాటిల్లిందని, దీనికి రూ.12 కోట్లు కట్టాలని ఎన్‌హెచ్‌కు ఆ సంస్థ ప్రతిపాదించింది. వెయ్యి మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం కలిగిన తమ ప్లాంట్‌కు టవర్ల మార్పిడి వల్ల జరుగుతున్న నష్టాన్ని యూనిట్ల వారీగా లెక్కించి మరీ భారీ మొత్తాన్ని చెల్లించేందుకు ల్యాంకో డిమాండ్ చేయడం వెనుక పెద్ద కుట్రే దాగి ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మూడు యూనిట్లు కలిగిన ల్యాంకో పవర్ ప్రాజెక్ట్ ప్లాంట్‌ను సదరు యాజమాన్యం రెండేళ్ల కిందటే మూసివేసింది. యూనిట్లను స్క్రాప్‌గా విక్రయించటానికి ఆక్షన్ నిర్వహించింది. సింగపూర్‌కు చెందిన ఓ సంస్థ రెండు యూనిట్లను కొనుగోలు చేసి యంత్ర సామగ్రిని ఊడతీసుకుని వెళ్లిపోయింది. రాధా టీఎంటీ సంస్థ మాత్రం తాను కొనుగోలు చేసిన యూనిట్‌ను ఇంకా తొలగించలేదు. ఆ సంస్థ ఈ యూనిట్‌ను తిరిగి ఇక్కడే పునరుద్ధరించాలన్న ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. దీనిపై ఆ సంస్థకు ఉన్న ఆసక్తిని తెలుపుతూ 350 కేవీ విద్యుదుత్పత్తి చేపట్టేందుకు సంసిద్ధంగా ఉన్నామని అనుమతి కోసం కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాసింది. ఈ తాజా ప్రతిపాదనను బట్టి చూసినా ఇప్పటి వరకు కూడా ల్యాంకో పవర్ ప్రాజెక్టులో ఎలాంటి విద్యుదుత్పత్తి జరగటం లేదన్నది స్పష్టంగా అర్థమవుతోంది. ఇలాంటప్పుడు ల్యాంకో సంస్థకు రూ.12 కోట్లు ఎన్‌హెచ్ ఎందుకు కట్టాలన్నది ప్రశ్న. ఈ ప్రశ్న వేయాల్సిన ఎన్‌హెచ్ రీజనల్ ఆఫీసు అధికారులు కిమ్మనకుండా రూ.12 కోట్లు చెల్లించేందుకు సుముఖంగా ఉండటం తీవ్ర ఆరోపణలకు తావిస్తోంది. ల్యాంకో సంస్థకు, ఎన్‌హెచ్ రీజనల్ ఆఫీసు ఉన్నతాధికారుల నడుమ వాటాల డీల్ కుదరిందన్న రైతుల ఆరోపణలకు రూ.12 కోట్ల అంశం బలాన్ని చేకూరుస్తోంది.

సూపర్‌వైజేషన్ చార్జీల విషయంలోనూ గోల్‌మాల్ ?

ల్యాంకో హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడికి సంబంధించి సూపర్ వైజేషన్ చార్జీల కింద రూ.45 లక్షలు చెల్లించాల్సిందిగా తమ ప్లాంట్ మూతపడక ముందు ల్యాంకో ఎన్‌హెచ్‌కు లేఖ రాసింది. ప్లాంట్ మూత పడిన నేపథ్యంలో రూ.45 లక్షలను మిగతా 6లో..



సానా సతీష్‌ను సత్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

సానా సతీష్‌కు కేశినేని చిన్ని శుభాకాంక్షలు

వన్‌టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన సానా సతీష్ మర్యాదపూర్వకంగా ఎంపీ కేశినేని శివనాథ్‌ను గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిశారు. రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సతీష్‌కు ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించి, వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర కారదర్శి గన్నే ప్రసాద్ (అన్న), టీడీపీ నాయకులు మాదిగాని గురునాథం, సూరపనేని సురేష్‌లు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్ చాంపియన్ తేజేష్‌కు అభినందన



ఇటీవల తమిళనాడు పొలాచ్చిలో జరిగిన 62వ నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో పాల్గొని పతకాలను సాధించిన విజయవాడ అరండల్‌పేటకు చెందిన పి.తేజేష్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. అతడికి ప్రోత్సాహాన్నిచ్చిన తండ్రి బాలసుబ్రహ్మణ్యం కూడా ప్రశంసించారు. రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో క్వార్టర్స్ షో గ్రూపుల్లో బంగారు పతకాలు, పెయిర్ స్కేటింగ్‌లో, కపుల్ డ్యాన్సింగ్, ఇన్‌లైన్ స్కేటింగ్, సోలో డ్యాన్స్ స్కేటింగ్‌లో రజత పతకాలు పొందారు. ఈ సందర్భంగా ఎంపీకి తేజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

డిజిటల్ అరెస్ట్‌కు బ్యాంక్ అధికారుల చెక్

» బ్యాంకు అధికారులకు సీపీ అభినందన



బ్యాంక్ అధికారులను అభినందిస్తున్న సీపీ రాజశేఖర్ బాబు

గుణదల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సైబర్ క్రైమ్ డిజిటల్ అరెస్ట్ జరగకుండా చెక్ పెట్టడంలో బ్యాంక్ అధికారులు కీలక పాత్ర పోషించాలని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు అన్నారు. డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో జరుగుతున్న సైబర్ నేరాలకు చెక్ పెట్టేందుకు నగర పోలీసులు రూపకల్పన చేసిన తీరుకు ఫలితం దక్కింది. ఖాతాదారులు కంగారుగా బ్యాంక్‌కు వచ్చి పెద్ద మొత్తంలో ఆన్‌లైన్ ట్రాన్‌శాక్షన్ చేస్తుంటే అటువంటి వారిని గుర్తించి వారికి కొన్ని ప్రశ్నలు సంధించాలని పోలీసులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో తాజాగా ఈనెల 12న ప్రజాశక్తినగర్ బ్రాంచ్ ఎస్‌బీఐకు వెళ్లిన ఓ వ్యక్తి తన ఖాతా నుంచి డబ్బులు వేరొకరి కరెంటు అకౌంట్‌కు తరలించాలని బ్యాంక్ అధికారులను కోరడం జరిగింది. దీంతో సిబ్బంది పిచ్చయ్యకు అనుమానం వచ్చి సదరు విషయాన్ని బ్యాంక్ మేనేజర్ రామేశ్వర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన కస్టమర్‌ను పోలీసులు చెప్పిన విధంగా ప్రశ్నలు సంధించడంతో అసలు విషయం బయటపడింది. దీంతో ఖాతాను బ్లాక్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్వరం స్పందించి నేరం జరగకుండా చేసిన ప్రజాశక్తినగర్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ రామేశ్వర్, పిచ్చయ్యలను శుక్రవారం సీపీ తన చాంబర్లో సత్కరించారు. భవిష్యత్తులో మరెవరూ ఇలా మోసపోకుండా బ్యాంక్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తే డిజిటల్ అరెస్టులను పూర్తిగా కట్టడి చేయవచ్చని సీపీ తెలిపారు. ఎవరికైనా డిజిటల్ అరెస్టులు చేశామని, మీ పేరుమీద నిషేధిత పదార్థాలు కొరియర్ చేశారని మీరు వెంటనే డబ్బులు కట్టాలని బెదిరిస్తే వెంటనే దగ్గరలోని సైబర్ క్రైమ్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.



విశ్వవిరాసత్ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న వెంకయ్య

భారతీయ సంస్కృతి చదువుతో వృద్ధి

» స్కాట్‌స్పైన్‌లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య

పెనమలూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంస్కృతి అభివృద్ధి కేవలం చదువుతోనే సాధ్యమవుతుందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం కానూరు స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో జరిగిన విశ్వ విరాసత్2024-25 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్య మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, చదువుతోనే సమస్తం సాధించగలమని అన్నారు. పాఠశాలలో ఆటలను తప్పనిసరి చేయడాన్ని ప్రత్యేకంగా అభినందించారు. వివిధ అంశాల్లో నైపుణ్యత సాధించిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఎన్నో విషయాలను నేర్పే విధంగా, సంస్కృతీ సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉన్నాయని వెంకయ్యనాయుడు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రవీంద్రభారతి విద్యాసంస్థల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వీరమాచనేని శాంతి, ప్రత్యేక అతిథి కొడాలి శేషాద్రి, అకడమిక్ హెడ్ రమా, సీఈవో కొడాలి జాహ్నవి, ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ, వైస్‌ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇగ్నో దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో)లో 2025 జనవరి నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా పీజీ, డిగ్రీ, డిగ్రీ ఆనర్స్, పీడీ డిప్లమో, సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు విజయవాడ ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్ డి.ఆర్.శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 జనవరి 31వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పీజీ రెండో సంవత్సరం, డిగ్రీ రెండు, మూడవ సంవత్సరం, సెమిస్టర్ విధానంలో చదివే విద్యార్థులు, రీ రిజిస్ట్రేషన్ ఫీజును జనవరి 31వ తేదీలోగా చెల్లించవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్‌ను సందర్శించాలని, లేదా విజయవాడ కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో గల ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా దర్శించి కాని లేదా 0866-2565253 ఫోన్‌లోగాని తెలుసుకోవచ్చన్నారు.

శభాష్.. ఆల్ ద బెస్ట్

(5వ పేజీ తరువాయి)

విద్యార్థినుల ప్రతిభను గుర్తించి..

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల పేరెంట్ టీచర్స్ మీటింగ్స్‌ను నిర్వహించారు. అదే విధంగా నున్న జెడ్పీ పాఠశాలలో జరిగిన పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హాజరయ్యారు. ఆ సమయంలో పలువురు విద్యార్థినులతో మాట్లాడిన లక్ష్మీశ ఈ విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించారు. చురుగ్గా ఉండటం.. బెరుకు లేకుండా మాట్లాడుతుండటంతో వారికి స్వర్ణాంధ్ర కార్యక్రమంలో స్టాల్‌ను ఏర్పాటు చేసే అవకాశం కల్పించారు. విద్యార్థినులకు ఉపాధ్యాయులు సూరపనేని రవిప్రసాద్, పి.నాగేశ్వరరావు, సుబ్బారావు దిశానిర్దేశం చేసి స్టాల్ ఏర్పాటులో భాగస్వాములయ్యారు.

పొలాలను ముంచేస్తున్న.. ఉప్పు నీరు!

» కోన-వాడపాలెం గ్రామాల వద్ద కొట్టుకుపోయిన స్లూయిస్ గేట్లు
» ఖరీఫ్‌లో రెండుసార్లు వరినాట్లు వేసిన తీరప్రాంత రైతులు
» గేట్లు పాడవడంతో 12 గ్రామాల్లోని పంట పొలాలకు పొంచి ఉన్న ముప్పు



పాడైన న్యూకోన డ్రెయినేజీ అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు



(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం)

బందరు తీరప్రాంత గ్రామాల రైతులను న్యూకోన డ్రెయినేజీ నష్టాలపాలు చేస్తోంది. కోన-వాడపాలెం గ్రామాల మధ్య కరకట్ట కింద ఉన్న రెండు అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల గేట్లు కొట్టుకుపోవడంతోపాటు ఈ డ్రెయిన్ ఏళ్లతరబడి కనీస మరమ్మతులు లేక పూడుకుపోయింది. దీంతో సముద్రపునీరు పంటపొలాల్లోకి చొచ్చుకువస్తోంది. వరిపొలాల్లోకి ఉప్పునీరు చొచ్చుకురావడం, భారీ వర్షాలు కురిసిన సమయంలో రోజులతరబడి పంటపొలాలు నీటమునిగి పైరు చనిపోతోంది. రైతులు ఏడాదిలో రెండుసార్లుగా వరినాట్లు వేస్తున్నారు. 12 గ్రామాల రైతులు నాట్లు వేయడం, ఉప్పునీరు పొలాల్లోకి చొచ్చుకవచ్చి వరిపైరు చనిపోవడం ఆనవాయితీగా మారింది.

న్యూకోన డ్రెయినేజీ పరిస్థితి ఇదీ..

భోగిరెడ్డిపల్లి వద్ద న్యూకోన డ్రెయినేజీ ప్రారంభమవుతుంది. నెలకుర్రుగొల్లపాలెం, తుమ్మలచెరువు, తుమ్మలపాలెం, చిన్నాపురం, కోన, వాడపాలెం, వెంకటదుర్గాంబపురం, కొత్తపల్లె తుమ్మలపాలెం, వెంకటదుర్గాంబపురం, పెదయాదర. కమ్మవారిచెరువు గ్రామాల్లోని మురుగునీటిని సముద్రంలో కలిపే డేగల కోడు, మంగల్లంకకోడు, మధ్యకాలువ డ్రెయినేజీలను కలుపుకుని కోన-వాడపాలెంగ్రామాల మధ్య సముద్రపుకరకట్ట వద్ద అవుట్ ఫాల్ స్లూయిస్‌లద్వారా మురుగునీటిని సముద్రానికి అనుబంధంగా ఉన్న శింకులో కలుపుతుంది. కోన-వాడపాలెం గ్రామాల మధ్య కరకట్ట కింద ఆరుఖానాలతో న్యూకోనడ్రెయన్‌కు పాత అవుట్‌ఫాల్ స్లూయిస్ ఉంది. ఏడేళ్ల క్రితం కరకట్టను నూతనంగా నిర్మాణం చేసే సమయంలో పాతఅవుట్‌ఫాల్ స్లూయిస్‌ను యధాతథంగా ఉంచి, దానిపక్కనే నూతన అవుట్ ఫాల్ స్లూయిస్‌ను నిర్మాణం చేశారు. పాత అవుట్‌పాల్ స్లూయిస్‌ల గేట్లు ఎప్పుడో కొట్టుకుపోగా, నూతనంగా నిర్మాణం చేసిన అవుట్‌ఫాల్ స్లూయిస్‌గేట్లు పాడై కొట్టుకుపోయాయి. దీంతో ఈ రెండింటినుంచి పొలాల్లోని మురుగునీరు ఎంత వేగంగా సముద్రంలో కలుస్తుందో, సముద్రపుపోటు సమయంలో అంతే వేగంగా ఉప్పునీరు పొలాల్లోకి చొచ్చుకువస్తోంది.

ఈ ఏడాది 2,500 ఎకరాల్లో రెండుసార్లు వరినాట్లు వేసిన రైతులు

న్యూకోన డ్రెయినేజీ పరిధిలోని 12 గ్రామాల రైతులు 2,500ఎకరాల్లో ఈ ఏడాది మొదటిసారి నాట్లు వేయగా ఉప్పునీరు, మురుగునీరు పొలాలను ముంచెత్తడంతో వరిపైరు చనిపోయింది. దీంతో రెండోసారి నాట్లు వేశారు. ప్రస్తుతం ఈ డ్రెయినేజీ పరిధిలోని అధికశాతం పొలాల్లోని వరిపైరు పొట్టదశలో ఉంది. జనవరి నెలాఖరుకు గాని పంట కోతకు వచ్చే అవకాశం ఉంది. రెండుసార్లుగా వరినాట్లు వేయడంతో కనీసంగా కోటి రూపాయలకుపైగా ఖర్చుచేయాల్సి వచ్చిందని తీరప్రాంతగ్రామాల రైతులు చెబుతున్నారు. గత నాలుగేళ్లుగా న్యూకోన డ్రెయిన్ ఉప్పునీరు, లేదా మురుగునీటి బారిన పడి వరిపైరు చనిపోతోందని రైతులు అంటున్నారు.

పాత అవుట్‌పాల్ స్లూయిస్‌ను మూసివేయాలి

న్యూకోన డ్రెయినేజీకి కోన-వాడపాలెం గ్రామాల మధ్య ఉన్న పాత అవుట్‌ఫాల్ స్లూయిస్ శిథిలావస్థకు చేరిందని, దీనిని పూర్తిగా మూసివేయాలని రైతులు కోరుతున్నారు, కొత్త అవుట్‌పాల్ స్లూయిస్‌కు ఉన్న ఆరు ఖానాలకు అమర్చిన గేట్లు కొట్టుకుపోయాయని, నూతన గేట్లు ఏర్పాటు చేస్తేనే సముద్రపుపోటు సమయంలో ఉప్పునీరు పొలాల్లోకి చొచ్చుకురాకుండా ఉంటుందని రైతులు అంటున్నారు. ఈ విషయంపై పాలకులు, అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ అవుట్‌ఫాల్‌స్లూయిస్‌లను పరిశీలించి ఈ వేసవిలో గేట్లు అమర్చి, సమస్యకు శాశ్వతపరిష్కారం చూపాలని కోరుతున్నారు.

వైభవంగా డోకిపర్రు వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



జిల్లా అధికారులను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

గుడ్లవల్లేరు, డిసెంబరు, 13 (ఆంధ్రజ్యోతి) : డోకిపర్రు శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం ఉత్సవమూర్తులకు విశేష స్నపన, తిరుమంజన సేవలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు పి.వీ రారెడ్డి, విజయలక్ష్మి, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ తదితరులు పాల్గొన్నారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్న సందర్భంగా కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధర్‌లు డోకిపర్రు ఆలయం, గెస్ట్ హౌస్, హెలీపాడ్‌లను పరిశీలించారు. ఏర్పాట్లపై నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా అధికారుల బృందాన్ని ఆలయ నిర్వాహకులు బాపిరెడ్డి సన్మానించారు. కలెక్టర్ బాలాజీతో పాటు జేసీ గీతాంజలీ శర్మ, వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి గీతాబాయి, డీఆర్వో శ్రీదేవి, ఇన్‌చార్జ్ ఆర్డీవో వి.ఎస్ హెలా షారోన్ పాల్గొన్నారు.



స్వామివారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు

గన్నవరం విమానాశ్రయానికి ఎన్టీఆర్, రామోజీ పేరు పెట్టాలి

» ఎంపీ కేశినేని శివనాథ్‌కు వినతి

వన్‌టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయానికి ఎన్టీఆర్-రామోజీ అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం చేయాలని విమానాశ్రయ ఎయిర్‌పోర్టు అడ్వయిజర్ కమిటీ వైస్‌చైర్మన్, ఎంపీ కేశినేని శివనాథ్‌కు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ సౌత్ ఇండియా అధ్యక్షుడు జి.దీక్షా ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీని దీక్షాప్రసాద్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిచెప్పారని, అదేవిధంగా తెలుగు జర్నలిజానికి దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చిన 'ఈనాడు' అధినేత చెరుకూరి రామోజీరావు పేరును కలిపి గన్నవరం విమానాశ్రయానికి పెట్టాలని ఇటీవల ఒక తీర్మానం చేసినట్టు ఎంపీకి ఆయన వివరించారు. ప్రతిపాదనపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసి వినతి పత్రం అందచేసినట్టు తెలిపారు. ఎంపీకి వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎల్.అశోక్, జి.తరుణ్ తేజ్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

విజయవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) పీఎఫ్ ట్రస్టులో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాల్సిందిగా సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఏపీపీటీడీ ఎన్ఎంయూ అసోసియేషన్ అగ్రనాయకత్వం శుక్రవారం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎన్ఎంయూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావులు ఆయనకు ఒక లేఖను అందజేశారు. రివైజ్డ్ పేస్కేల్స్-2013 ప్రకారం ఉద్యోగి నుంచి రికవరీ చేసిన వేతన వివరాలను ఈపీఎఫ్‌ఓకు పంపి ఉద్యోగుల పెన్షన్ మంజూరులో తగ్గుదల లేకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

నీటి సంఘాల ఎన్నికలకు వేళాయె!

(5వ పేజీ తరువాయి)

ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఎవరిని నియమించాలనే అంశంపై ఇప్పటికే తుది నిర్ణయం తీసుకోవడంతో ఈ ఎన్నికలు మొత్తం ఏకగ్రీవంగానే జరిగే అవకాశం ఉంది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు ఎన్నికైన నీటి వినియోగదారుల సంఘాల ప్రెసిడెంట్‌లు, వైస్‌ప్రెసిడెంట్‌లతో అధికారులు సమావేశం నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. ఈప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ నెల 17వ తేదీన జిల్లాలోని 26 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకునే ప్రక్రియ జరుగుతుంది. అనంతరం ప్రాజెక్టు కమిటీ ఎన్నికను నిర్వహిస్తారు. ప్రాజెక్టు కమిటీ ఎన్నికకు సంబంధించిన షెడ్యూలును ఇంకా విడుదల చేయలేదు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

గాజువాక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతున్న నిందితుడిని, చోరీసొత్తును కొనుగోలు చేసిన మరో వ్యక్తిని విశాఖపట్నంలోని గాజువాక క్రైం పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. క్రైం డీసీపీ కె.లతామాధురి తెలిపిన వివరాలిలావున్నాయి. గాజువాక సింహగిరి కాలనీలోని పి.కుసుమకుమారి ఇంట్లో ఈ నెల 5న 20 తులాల బంగారు ఆభరణాలు, 25 తులాల వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి.



వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీసీపీ లతామాధురి

గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేయగా ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీ, నిందితుడు వినియోగించిన ద్విచక్రవాహనం ఆధారంగా దర్యాప్తు చేయగా కృష్ణా జిల్లా గుడివాడ జగనన్న కాలనీకి చెందిన పాత నేరస్థుడు ముద్దాని జగదీష్ అలియస్ జగన్ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. శుక్రవారం గాజువాక బీసీ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న జగదీష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్టు అంగీకరించాడు. పోలీసులు జగదీష్, చోరీ సొత్తును కొనుగోలు చేసిన జ్యోతిశివశ్రీని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. 25.7 తులాల బంగారు ఆభరణాలు, 50.5 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఇప్పటికే 14 కేసులున్నాయని, గుడివాడ వన్‌టౌన్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీటుందని, పోలీసులు తెలిపారు.

మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

విజయవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలు దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్నాయని, వారి సమస్యలపై ప్రత్యేక దృష్టి నిలిపి పరిష్కరించాల్సిందిగా ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావుకు ఏపీపీటీడీ ఎన్ఎంయూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై శ్రీనివాసరావులు శుక్రవారం లేఖ రాశారు. రెండు దశాబ్దాలుగా ఆర్టీసీలో మహిళల సదుపాయాల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందని తెలిపారు. గృహాలలో టాయ్‌లెట్స్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరి చేశాయని, సంస్థలో పనిచేసే మహిళలకు మాత్రం టాయ్‌లెట్స్ కరువయ్యాయని చెప్పారు. బస్‌స్టేషన్, టెర్మినల్ పాయింట్స్‌లో మహిళల కోసం ప్రత్యేక టాయ్‌లెట్స్ నిర్మాణానికి పూనుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. డిపోలు, స్టేషన్ల దగ్గర మంచినీటి సదుపాయం లేకపోవటం వల్ల మహిళలు కిడ్నీ, లివర్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. ఆర్టీసీ మహిళా ఉద్యోగులు ఎక్కువగా క్యాన్సర్, గుండె జబ్బులు, పక్షవాతం వంటి సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. సంస్థలో మహిళా సిబ్బంది రిక్రూట్‌మెంట్ జరిగి 28 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ చాలా డిపోలలో రెస్ట్‌రూమ్స్, సరిపడా బెడ్స్, రెస్ట్ రూమ్ అటాచ్డ్ టాయ్‌లెట్స్ వంటివి లేవన్నారు. మహిళలకు ఉన్న ఇబ్బందుల రీత్యా డిపోలలో వారికి ప్రత్యేక డ్యూటీలు విధించాల్సిందిగా అభ్యర్థించారు. మహిళా సిబ్బంది డ్యూటీలో ఉన్నపుడు బస్సు మధ్యలో ఆగిపోతే వారిని అక్కడే ఉంచకుండా డిపోలకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మహిళలకు చైల్డ్‌కేర్ లీవులను అమలు చేయాలని కోరారు. మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 5 క్యాజువల్ లీవులు, ప్రత్యేక సెలవులు, ప్రతి నెలా 3 రోజుల లీవు సదుపాయం వంటి వాటిపై చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు డీజీపీఎస్ రోవర్లు!



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): భూముల సర్వేకు సంబంధించి ఖచ్చితత్వంతో కూడిన నివేదికలను ఇచ్చేందుకు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని లైసెన్స్‌డ్ సర్వేయర్లు అత్యంత సాంకేతిక వ్యవస్థలైన డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (డీజీపీఎస్) రోవర్స్ సేవలు పొందున్నారు. భూముల సర్వే వ్యవహారాలకు సంబంధించి ప్రభుత్వ సర్వేయర్ల మీదనే ఆధారపడకుండా లైసెన్స్‌డ్ సర్వేయర్ల ద్వారా కూడా సేవలను పొందవచ్చు. సర్వే కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ సర్వేయర్లు రావటానికి నెల రోజులకు పైగా సమయం పడుతుంది. సర్వేయర్లపై పనిభారం ఒకటైతే.. నిత్యం క్షేత్రస్థాయిలో తిరగాల్సి ఉంటుంది. లైసెన్స్‌డ్ సర్వేయర్లు అందుబాటులో ఉన్నా ఖచ్చితత్వం ఉండదన్న అపోహలతో వారిని ఆశ్రయించటానికి చాలామంది సంకోచిస్తున్నారు. ప్రభుత్వ సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఎవరు నివేదికలు ఇచ్చినా ఖచ్చితత్వంగానే ఉంటాయి. శాటిలైట్ ఆధారితంగా పనిచేసే డీజీపీఎస్ రోవర్ యంత్రాలు లైసెన్స్‌డ్ సర్వేయర్లకు అస్త్రాలుగా మారాయి. డీజీపీఎస్ రోవర్ల ద్వారా టోపో సర్వే, కాంటూర్ సర్వే, రోడ్ సర్వే, కెనాల్ సర్వే, రైల్వే సర్వే, ఇంటి లేఅవుట్ ప్లాట్ మార్కింగ్, ఫీల్డ్/సరిహద్దు సర్వే, ఎలివేషన్స్ లెవల్స్ సర్వే, నేలపై డ్రాయింగ్, మెరక మార్కింగ్ వంటి పనులు చేపడతారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి

» కలెక్టరేట్ వద్ద వైసీపీ నేతల ఆందోళన

మచిలీపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యంకు మద్దతు ధర కల్పించాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైసీపీ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. తొలుత కలెక్టరేట్ సమీపంలోని ధర్నాచౌక్ వద్ద రైతులను ఆదుకోవాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధరను కల్పించాలని, ధాన్యం కొనుగోలులో దళారీ వ్యవస్థను తొలగించాలని, రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20వేలు అందించాలని, తేమశాతం లెక్కలు చూపి రైతులను ఇబ్బందులపాలు చేయడం మానుకోవాలని ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అవనిగడ్డ నియోజకవర్గ మాజీఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వహయాంలో 22-ఏలో ఉన్న భూములను రైతులకు పట్టాలు అందించడం జరిగిందన్నారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 22-ఏ భూములకు పట్టాలుఇచ్చే అంశాన్ని పక్కనపెట్టిందన్నారు. గత ఏడాది డిసెంబరునెలలో మిచౌంగ్ తుపాను కారణంగా కురిసిన భారీవర్షాలకు ధాన్యం తడిసి, పాడైనా, వైసీపీప్రభుత్వం కొనుగోలుచేసి రైతులను పూర్తిస్థాయిలో ఆదుకుందన్నారు. పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ, కూటమిప్రభుత్వం ధాన్యం కొనుగోలులో పూర్తిగా విఫలమైందన్నారు. ధాన్యంలో తేమశాతంను సాకుగాచూపి మద్దతుధరలో కోతపెడుతోందన్నారు. దళారులు నిర్ణయించిన ధరకే రైతులు ధాన్యం విక్రయించాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో పెడన వైసీపీ ఇన్‌చార్జి ఉప్పాల రాము, పెనమలూరు వైసీపీ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ గేటువద్ద కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. ధాన్యంకు గిట్టుబాటుధర కల్పించాలని, కొనుగోలులో నిబంధనలను సడలించాలని కోరుతూ డీఆర్వో శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు.



ధర్నాచౌక్ వద్ద ధర్నా చేస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

పెద్ద స్కెచ్చే వేశారు!?

(5వ పేజీ తరువాయి)

సూపర్ వైజేషన్ చార్జీల కింద ల్యాంకోకు చెల్లించాల్సిన అవసరం ఉందా? లేదా? అన్నది కూడా చర్చనీయాంశంగా మారుతోంది. ల్యాంకోకు ఎస్‌హెచ్ రూ.45 లక్షలు చెల్లింపు వ్యవహారాలపైనా తీవ్ర అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో కూడా ఎస్‌హెచ్ రీజనల్ ఆఫీసు, ల్యాంకో మధ్యన వాటాల డీల్ కుదిరిందని రైతులు ఆరోపిస్తున్నారు.

టవర్ స్క్రాప్ మెటీరియల్ తరుగు చూపకపోవడంలోనూ వాటాలు?

ల్యాంకో పవర్ ప్లాంట్ మూత పడక ముందు .. ఆ సంస్థ తరఫున ట్రాన్స్ మిషన్ టవర్లను మార్చటానికి రూ.32.58 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాలు రూపొందించి ఎస్‌హెచ్‌కు ఇచ్చింది. విద్యుత్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే అలైన్‌మెంట్ తయారు చేసి రూ. 32.58 కోట్ల అంచనాలను రూపొందించినట్టు ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ ఆ ప్రతిపాదనే నిజమనుకున్నా.. ఇందులో ఇంకో తప్పు జరిగింది. వాస్తవానికి మెటీరియల్ స్క్రాప్‌ను ఈ అంచనాలో తీసి వేయాలి. ఇదే విజయవాడ బైపాస్ వెంబడి ట్రాన్స్‌కో, పవర్ గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడికి సంబంధించి రూ. 3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు మెటీరియల్ స్క్రాప్‌గా చూపారు. ల్యాంకోకు సంబంధించి రూ. 32.58 కోట్ల వ్యయంతో చేపడుతున్న 11 ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడికి రూ.10 కోట్ల పైనే టవర్ల స్క్రాప్ కింద చూపించాల్సి ఉంటుందన్నది అంచనా. టవర్ల స్క్రాప్ మెటీరియల్ తరుగు చూపించకపోవటం వెనుక కూడా ల్యాంకో, ఎస్‌హెచ్ ఆర్వో కార్యాలయ ఉన్నతాధికారుల నడుమ వాటాల డీల్ కుదిరిందని రైతులు ఆరోపణలు చేస్తున్నారు.

1000 మెగావాట్లా ? 350 మెగా వాట్లా ?

మూత పడక ముందు ల్యాంకో పవర్ ప్లాంట్ లిమిటెడ్ సామర్థ్యం 1000 మెగా వాట్లుగా ఉంది. మూతపడ్డాక.. రెండు యూనిట్లలోని మెషినరీ స్క్రాప్‌గా తరలి వెళ్లిపోయిన తర్వాత మిగిలిన ఒక యూనిట్ సామర్థ్యం 1000 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేయగలదా అన్నది ప్రశ్నగా ఉంది. ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడి ద్వారా 1000 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అవాంతరం ఏర్పడటం వల్ల రూ.12 కోట్లు డ్యామేజీ చార్జీల కింద చెల్లించాలని ల్యాంకో తరఫున ఎస్‌హెచ్‌కు ప్రతిపాదించటం జరిగింది. ల్యాంకో అసలు యాజమాన్యం ఇది ప్రతిపాదించిందా ? ఇందులో ఒక యూనిట్‌ను కొనుగోలు చేసిన రాధా టీఎంటీ సౌజన్యంతో ప్రతిపాదించారా అన్నది తేలాల్సి ఉంది. ఇందులో అసలు ట్విస్ట్ ఏమిటంటే.. మిగిలిన ఒక యూనిట్‌లో 350 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తామని కేంద్రానికి ల్యాంకో తరఫున ప్రతిపాదించటం జరిగింది. కేంద్రానికి రాసిన లేఖలో 350 మెగావాట్లను ప్రతిపాదించి.. 1000 మెగా వాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం పేరుతో రూ. 12 కోట్లు డిమాండ్ చేయటం చూస్తే ఈ వ్యవహారంలో ఏదో కిరికిరి ఉందనిపిస్తోంది.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.630

స్వర్ణాంధ్రప్రదేశ్ సభకు తరలిన మహిళలు

ఉయ్యూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తు విజన్ సభకు ఉయ్యూరు మండలం నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు తరలివెళ్లారు. గండిగుంట నుంచి సభకు ప్రజలను తీసుకు వెళుతున్న బస్సుకు ఎంపీడీవో శేషగిరిరావు జెండా ఊపి ప్రారంభించారు. ఉయ్యూరు పట్టణం, మండల పరిధి గ్రామాల నుంచి ప్రజలు తరలి వెళ్లారు.



జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీడీవో శేష గిరిరావు

బాగుపడిన బీబీఆర్ నగర్ రోడ్లు

• 35 ఏళ్లుగా రహదారులు లేక 200 కుటుంబాల అవస్థలు • ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు రుణపడతామన్న స్థానికులు

బీబీఆర్ నగర్‌లో చిన్నపాటి వర్షం పడితే మోకాళ్ల లోతు నీళ్లు నిలిచి రోగాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరగలేక నానా అవస్థలు పడే వారు. రహదారులు అభివృద్ధి చేయడంతో నగర వాసులు ఆనందం వ్యక్త పరుస్తున్నారు.

కంకిపాడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలు వస్తుంటాయి... పోతుంటాయి...పాలకులు వస్తుంటారు...పోతుంటారు... అయినా తమ గోడు పట్టించుకున్న వారే లేరు అన్న బీబీఆర్ నగర్ వాసుల కల నెరవేరింది. సుమారు గత 35 సంవత్సరాల నుంచి బీబీఆర్ నగర్‌లో రెండు వందల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. చిన్నపాటి వర్షం పడితే మోకాళ్ల లోతు నీళ్లు నిలిచి రోగాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరగలేక నానా అవస్థలు పడే వారు. ప్రతి ఐదేళ్ల కోసారి అధికారం మారేదే తప్ప తమ తలరాతలు మారేవి కాదంటున్నారు నగర్ వాసులు. అయితే 2024లో అధికారంలోకి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బలపర్చిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తమ రహదారులు అభివృద్ధి చేసి తమ కల సాకారం చేశారంటూ నగర వాసులు ఆనందం వ్యక్త పరుస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి రుణ పడి ఉంటామంటూ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అంతర్గత రహదారి



బి.బి.ఆర్ నగర్ ప్రధాన రహదారి

మా బతులు ఇంతే అనుకున్నాం



గత 35 సంవత్సరాలుగా ఇదే బీబీఆర్ నగర్‌లో ఉంటున్నాం. పాములు, తేళ్లు ఇలా భయంకరమైన వాటి బారిన బడి నానా ఇబ్బందులు పడ్డాం. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రహదారులు అభివృద్ధి చేశాయి. ఇప్పుడు ప్రశాంతంగా జీవిస్తాం.

మారేషు, స్థానికుడు

బోడె ప్రసాద్ పుణ్యమే



ఎక్కడో పుట్టాము...ఇక్కడకు వచ్చి స్థిర పడ్డాం. 35 ఏళ్ల నుంచి నడిచేందుకు సరైన రహదారి కూడా లేక నానా అవస్థలు పడ్డాం. అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పుణ్యమా అంటూ రహదారులు అభివృద్ధి జరిగాయి.

కత్తుల రమణ, స్థానికురాలు

డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి



రహదారుల అభివృద్ధి బాగుంది. రహదారులతో పాటు డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. 200 కుటుంబాల వారు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు రుణ పడి ఉంటారు.

మేరమ్మ, స్థానికురాలు



నందీశ్వరుడికి ప్రదోషకాల అర్చనలు

నందీశ్వరునికి అభిషేకార్చనలు

విజయవాడ కల్చరల్: యనమలకుదురు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం త్రయోదశిని పురస్కరించుకొని ప్రదోషకాలంలో మహానందీశ్వర స్వామికి అభిషేకార్చనలు నిర్వహించారు. దేవస్థానం ముఖ్య అర్చకులు జీఆర్‌వీ సాగర్ పర్యవేక్షించారు. పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ నరసింహారావు, ఎన్.భవానీ పాల్గొన్నారు.



రైతులకు అండగా ఉంటా : యార్లగడ్డ

ప్రసాదంపాడు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మహనీయులు పుట్టినిల్లు కృష్ణాజిల్లా అని ఆ జిల్లా వ్యక్తిగా రైతులకు తాను ఎప్పుడు అండగా ఉంటానని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శుక్రవారం నిడమానూరులో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవనాన్ని యార్లగడ్డ ప్రారంభించారు. తొలుత వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం రిబ్బన కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ లక్ష్యాలతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘం ఏర్పాటైయ్యిందో ఆ లక్ష్యాలకు అనుగుణంగా కార్యవర్గం, అధికారులు పని చేయాలని సూచించారు. కృష్ణాజిల్లాకు చెందిన మహనీయుల విగ్రహాలను మచిలీపట్నంలో కానీ విజయవాడలో కానీ ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు తన వంతు సహాకారం అందిస్తానని వెల్లడించారు. తాను కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని వెల్లడించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు సీఈవో శ్యామ్ మనోహర్, మేనేజర్ రంగరాజు, సూపర్ వైజర్ రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్న రామారావు, నాయకులు బండి వెంకట్రావు, అడుసుమిల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

మహాగర్జన సభ కరపత్రాలు ఆవిష్కరణ

ఉంగుటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణతో పాటు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా వున్న మాలల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 15న గుంటూరులో నిర్వహిస్తున్న మాలల మహాగర్జన సభలో మాలలందరూ సంఘటితంగా పాల్గొని విజయవంతం చేయాలని మాల మహానాడు గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు సరిహద్దు ఆంథోని పిలుపునిచ్చారు. శుక్రవారం మండలకేంద్రమైన ఉంగుటూరు ఎస్సీకాలనీలో అంబేద్కర విగ్రహం వద్ద స్థానిక నాయకులతో కలిసి మహాగర్జన సభ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం కాలనీలో గడపగడపకూ వెళ్లి కరపత్రాలు అందజేసి, మహాగర్జన సభకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని విజ్ఞప్తిచేశారు. ఈకార్యక్రమంలో నాయకులు అమర్తల కోటయ్య, నూదం కొండలు, డాక్టర్ రామస్వామి, కొత్తా జోజివరప్రసాద్, గుండే మోషేరావు, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని బేతాళ శేషు అన్నారు. బండారుగూడెంలో శుక్రవారం మాలల మహాగర్జన విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. మాలలకు అన్యాయం జరిగేలా ఉన్న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గుంటూరులో ఈనెల 15న నిర్వహించే మాలల మహాగర్జన ప్రతి ఒక్కరూ హాజరై మాలల ఐక్యతను చాటేలా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాములూరి గణేష్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా శ్రీచైతన్య వార్షికోత్సవం

పెనమలూరు, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య ఇంద్ర టవర్స్ కళాశాల వార్షికోత్సవం కానూరు మన కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ చదువులో విద్యార్థులకు అవసరమైన దిశానిర్దేశం చేశారు. గతేడాది నీట్‌లో ఉత్తీర్ణులై మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులకు,స్పోర్ట్స్‌లో పతకాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. ముందుగా సంస్థ కార్యనిర్వాహక ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాన్ని ఎగ్జిక్యూటివ్ డీన్ టీ సురేష్‌బాబు, డీన్ రవీంద్రలు పర్యవేక్షించారు. ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



విజేతలతో శ్రీచైతన్య యాజమాన్యం

ఆర్థిక ఊతమిచ్చే సంస్థను తొలగించడం అన్యాయం

ప్రసాదంపాడు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): :రామవరప్పాడు పంచాయతీలో బసవతారకం అభ్యుదయ మహిళా మండలి గత కొన్నేళ్లుగా నడిపుస్తున్నానని, పేదవారికి ఆర్థిక ఊతమిచ్చేలా వారికి కుట్టు మిషన్‌పై శిక్షణ అందిస్తున్నానని ఆ సంస్థ అధ్యక్షురాలు టి. జానకిదేవి అన్నారు. శుక్రవారం రామవరప్పాడులో బసవతారకం అభ్యుదయ మహిళా మండలి రేకుల షెడ్డును తొలగించిన ప్రాంతంలో ఆమె నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు తమ సంస్థ రేకుల షెడ్డును అక్రమంగా కూల్చేశారని ఆరోపించారు. తాను ఆ భూమిని 2006లో కొనుగోలు చేశానన్నారు. రాజకీయ కక్షతోనే కోర్టులో ఫిర్యాదు చేసి కూల్చారన్నారు. కూల్చే సమయంలో తనకు ఎటువంటి సమాచారం అందించలేదని ఆరోపించారు. షెడ్డులోని విలువైన వస్తువులు ఎక్కడకి తరలించారో కూడా చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



నిరసన తెలుపుతున్న టి. జానకీదేవి

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పెనమలూరు, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): కానూరు సూపర్‌విజ్ రోడ్డులోని నారాయణ జూనియర్ కళాశాల ఎన్120స్టార్‌సీవో క్యాంపస్‌లో శుక్రవారం విద్యార్థులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, స్థానికులకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. సుమారు 400 మందికి విజయవాడ క్లోవ్ డెంటల్ ఆసుపత్రి, డాక్టర్ మోహన్ డయాబెటిక్ సెంటరు, మ్యాక్సివిజన్ కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో దంత పరీక్షలు, కంటి పరీక్షలు, షుగరు, బీపీ పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్ శ్రీరామచంద్రచౌదరి, ఏజీఎం రాజశేఖర్‌బాబు, అకడమిక్ ప్రిన్సిపాల్ చిరుమామిళ్ల అంజిబాబు, అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపాల్ పిన్నింటి శ్రీనివాసరావు, ఏఓలు, వైస్ ప్రిన్సిపాళ్లు , ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జీతాలు ఇప్పించాలని వినతి

ఉయ్యూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆరునెలలుగా జీతాలు రాక ఇబ్బంది పడుతున్న మాకు జీతాలు ఇప్పించాలని ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు, వాచ్‌మెన్‌లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌ను కలసి మొరపెట్టుకున్నారు. మండల పరిధిలో ప్రభుత్వప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల స్వీపర్లు, వాచ్‌మెన్‌లు శుక్రవారం రాజేంద్ర ప్రసాద్‌ను కలిసి జీతాలు ఇప్పించే ఏర్పాట్లు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఆ మేర జిల్లా విద్యాశాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడి జీతాలిప్పించాలన్నారు. స్పందించిన విద్యాశాఖ అధికారి సాధ్యమైనంత త్వరగా వారికి జీతాలు ఇప్పిస్తామని రాజేంద్రప్రసాద్‌కు హామీ ఇచ్చారు. ఉయ్యూరు హైస్కూల్ సాయి తదితరులు రాజేంద్రప్రసాద్‌ను కలిశారు.



వినతి పత్రం అందచేస్తున్న స్వీపర్లు

16 నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభం

గన్నవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దావాజీగూడెం శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి మంగళ శాసనములతో ఈ నెల 16 నుంచి ధనుర్మాసం పూజలు ప్రారంభమవుతాయని ఆలయ అర్చకులు రామాచార్యులు తెలిపారు. ఉపాలయంలో ఉన్న శ్రీ గోదాదేవి సమేత శ్రీకృష్ణ స్వామికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అనంతరం భక్తులందరికీ దీక్షాకంకణ ధారణ జరుగుతుందన్నారు. విశేష అర్చన తదుపరి తిరప్పావై సేవాకాలం, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించబడతాయన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్వామికి పుష్పాలంకరణ చేశారు.

ముగిసిన వర్క్‌షాప్

ఉయ్యూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏజీఅండ్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మేనేజ్‌మెంట్ తరఫున కళాశాలలో రెండురోజుల పాటు జరిగిన ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజెన్స్ వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. గుంటూరు టీజేపీఎస్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి డబ్బు ఎక్కడ పెట్టుబడిగా పెట్ట వచ్చన్న అంశంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, వాణిజ్య విభాగ అధిపతి ఎన్.వసంతరావు, గోపీచంద్, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేవాలయ నిర్వహణ ప్రక్షాళన కోసమే హైందవ శంఖారావం నిర్వహించడం జరుగుతున్నదని మండల కన్వీనర్ తట్టి సుబ్బారావు అన్నారు. కానుమోలులో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి హైందవ శంఖారావం ఆహ్వాన పత్రికలను అందజేశారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కోసం జనవరి 5వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ భక్తి బృంద సభ్యులు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన

ఉయ్యూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఫసల్ బీమాపథకం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను తెలియచేస్తూ శుక్రవారం గండిగుంట ఆర్ఎస్‌కెలో శుక్రవారం వ్యవసాయ శాఖ గన్నవరం అసిస్టెంట్ డైరెక్టర్ సునీల్ అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లాలో మినుము, పెసర, మొక్కజొన్న, వరి పంటలకు ఈ పథకం వర్తిస్తుందని రైతులు పంట బీమా చేసి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యసాయ అధికారి నిస్సీగ్రేస్ ఈపథకం వివరాలు తెలియచేశారు.

మెగా జాబ్ మేళా నేడు

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం విజయవాడ రూరల్ మండలం టీడీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరక్షరాస్యుల నుండి పీజీ వరకు నిరుద్యోగులకు వారి అర్హతలను బట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర విజన్ 2047 ఆవిష్కరణోత్సవం సందర్భంగా శుక్రవారం జంక్షన్ పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు నిర్వహించారు. బొమ్ములూరు చెక్ పోస్టు, జంక్షన్ నాలుగు రోడ్ల కూడలిలో ఎస్సై సురేష్ పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది వాహనాలను మళ్లించారు. వైజాగ్, ఏలూరు నుంచి విజయవాడ మీదుగా చెన్నై, మద్రాసు వెళ్లే సరుకుల వాహనాలను గుడివాడ మీదుగా మళ్లించారు. హైదరాబాద్ వెళ్లే వాహనాలను నూజివీడు మీదుగా మళ్లించారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూములకు సంబంధించిన వివిధ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను గ్రామస్థాయిలో నిర్వహిస్తున్నామని తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. కొత్తపల్లిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో నూజివీడు సబ్ రిజిస్ట్రార్, కానుమోలు రిజిస్ట్రార్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. రీ సర్వేల్లో భూముల కొలతలు తారుమారు కావడం, ఆన్‌లైన్‌లో తప్పులను సరిచేసే విధంగా రెవెన్యూ యంత్రాంగం ప్రజలకు అందుబాటులో సేవలందిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్తపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో భూముల(ఎల్‌పీ)సబ్ డివిజన్‌కు సంబంధించి 5 ఫిర్యాదులు, కొలతల్లో తప్పులపై ఒక ఫిర్యాదు వచ్చిందని వీఆర్వో శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సబ్ రిజిస్ట్రార్ ప్రశాంత్, కానుమోలు రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఝాన్సీరాణి, మండల సర్వేయర్ ఫణికుమార్, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలోని ఆముదాలపల్లి, వెల్దిపాడు గ్రామాల్లో రెవెన్యూ ఇతర అనుబంధశాఖల అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వెల్దిపాడు సచివాలయంలో సర్పంచ్ లాం నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ జాలాది విమలకుమారి పలు భూసమస్యలపై ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు .టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యంత పకడ్బందీగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, జిల్లా సర్వే లాండ్‌రికార్డ్స్ ఆఫీసర్ జోషీ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే నరసింహారావు, మండల ఎండోమెంట్ ఆఫీసర్ ఈవీ ప్రసాదరావు, ఆర్ఐ బి.సూర్యకాంతి, ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, వీఆర్వోలు, పిచ్చయ్య, చైతన్యకుమార్, టీడీపీ నాయకులు బొకినాల నాగేశ్వరరావు, పరిటాల విష్ణు, నెక్కలపూడి వెంకటరాజమన్నార్, రామ్మోహనరావు పాల్గొన్నారు.



హనుమాన్‌జంక్షన్ రూరల్‌లో..



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పక్కన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్





స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ సందర్భంగా వేదికపై కూచిపూడి నృత్యం, తప్పెటగుళ్ల ప్రదర్శన

'స్వర్ణాంధ్ర' డాక్యుమెంట్ ఆవిష్కరణలో

సాంస్కృతిక సందడి

వన్‌టౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా సాగాయి. రాష్ట్ర ప్రభుత్వ బాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. గణపతి వందనం కూచిపూడి నృత్యంతో ప్రారంభమైన సాంస్కృతిక ప్రదర్శనలు 2 గంటల సేపు అలరించాయి. రమణ, రాజేష్‌ల బృందం విజన్-2047పై పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. వ్యవసాయం ప్రధాన అంశంగా పదిమంది నృత్య కళాకారులు చేసిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను అలరించింది. బాబూరావు చేసిన మిమిక్రీ ప్రేక్షకుల హర్షధ్వానాలను అందుకుంది. ఏసు ప్రసాద్ బృందం గరగ నృత్యం ఆకట్టుకుంది. రాజీవ్ బృందం డప్పుల ప్రదర్శన విశేష స్పందనను పొందింది. హాస్యవల్లరి కార్యక్రమంలో హరిబాబు బృందం ప్రేక్షకులను నవ్వించింది. దేవీ బృందం బుర్రకథ, సత్యరాజ్ బృందం తప్పెటగుళ్లు ఆకట్టుకున్నాయి. ప్రాచీన కళారూపాలను కళ్లకు కట్టినట్టు గుర్తుచేశాయి. హంసధ్వని కూచిపూడి నృత్యాలయం, ఎనికేపాడు విజ్ఞాన విహార్ హైస్కూల్ చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సభకు వచ్చిన వారందరినీ ఆకట్టుకున్నాయి.



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు మామిడికాయలు అందజేస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి



సంతకం చేస్తున్న ఎంపీ కేశినేని చిన్ని



వాటర్ ట్యాంకు రోడ్డులో నుంచి ఐజీఎం స్టేడియానికి తరలివస్తున్న ప్రజలు



గన్నవరం భువనేశ్వరీ పీఠంలో మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ధార్మిక మార్గాన్ని అనుసరిస్తేనే

మంచి సమాజ నిర్మాణం

» మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

గన్నవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'ప్రస్తుత సమాజంలో పాశ్చాత్య అనుకరణ, భోగలాలస పెరుగుతోంది. ఫలితంగా అశాంతి నెలకొంటోంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడాలన్నా, మంచి సమాజం సాధ్యం నిర్మితమవ్వాలన్నా ప్రజలు ధార్మిక మార్గాన్ని అనుసరించాలి.' అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న సచిదానంద ఆశ్రమంలోని భువనేశ్వరీ పీఠాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భువనేశ్వరీ పీఠం విశిష్టతను పీఠాధిపతి కమలానంద భారతీస్వామి వివరించారు. పూజల అనంతరం వెంకయ్యనాయుడు మాట్లాడారు. క్రమశిక్షణ, దైవభక్తి, మంచి ఆహారపు అలవాట్లు, జీవనశైలితో మంచి సమాజం నిర్మితమవుతుందని, కుటుంబాలు శక్తిమంతం కావడం ద్వారా సమాజం, దేశం శక్తిమంతమవుతాయని ఆయన పేర్కొన్నారు. భువనేశ్వరీ పీఠం ఆశ్రమానికి తన కుమారుడు హర్షవర్ధన్ నిర్వహిస్తున్న ముప్పవరపు ఫౌండేషన్ నుంచి రూ.5లక్షల విరాళాన్ని ప్రకటించారు. కమలానంద భారతీ స్వామి అనుగ్రహభాషణ చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

» యువతకు వెంకయ్యనాయుడు సూచన

ఉంగుటూరు: మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలు తెలుగురాష్ట్రాల్లో పెద్ద సమస్యగా పరిణమించాయని, వాటికి యువత దూరంగా ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. ఆత్కూరు స్వర్ణ భారత్‌ట్రస్ట్(విజయవాడ చాప్టర్)లో వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందుతున్న యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. భారత్‌ను నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో పాకిస్థాన్ మనదేశంలోకి సరిహద్దుల వెంబడి మాదక ద్రవ్యాలను చొప్పిస్తోందన్నారు. పాకిస్తాన్ దుశ్చర్యతో పంజాబ్ మాదకద్రవ్యాల ప్రభావానికి గురైందన్నారు. క్రమంగా ఇతర రాష్ట్రాలకు ఈ భూతం వ్యాపిస్తోందన్నారు. ఎన్ఆర్ఐ నిమ్మగడ్డ రవి, ట్రస్ట్ ప్రతినిధులు, వివిధ శిక్షణ కేంద్రాల డైరెక్టర్లు, శిక్షణార్థులు పాల్గొన్నారు.



గన్నవరం సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తా

» గన్నవరం సీహెచ్‌సీ కమిటీ ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)ను వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శుక్రవారం నిర్వహించిన సీహెచ్‌సీ కమిటీ ప్రమాణ స్వీకారంలో ఆయన మాట్లాడారు. ఎయిర్‌పోర్టుకు దగ్గరలో ఉన్న ఈ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చేందుకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో మాట్లాడానని, వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశిస్తున్నానని ఆయన తెలిపారు. సీహెచ్‌సీలో తక్షణమే మరమ్మతులు, ఎలక్ట్రికల్ పనులు చేయాలని ఎంపీడీవో టి.స్వర్ణలతకు ఆయన సూచించారు. గన్నవరం పంచాయతీ నుంచి రూ.5 లక్షలు ఆస్పత్రికి ఇవ్వాలని సూచించారు. కేడీసీసీ బ్యాంకు సీజీఎఫ్ ఫండ్ నుంచి కొంత నగదు వచ్చేలా చేస్తానన్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో మాట్లాడి సీహెచ్‌సీలో ఫర్నిచర్ ఏర్పాటు చేయిస్తానన్నారు. ఆస్పత్రి ఛైర్మన్‌గా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కమిటీ సభ్యులుగా దేవినేని సులోచన, బుస్సే నాగప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ శారమ్మ పాల్గొన్నారు.



ఇటీవల పటమట పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

జల్సాల కోసం

బైక్ చోరీలు

పొరుగు జిల్లాల నుంచి నగరానికి వస్తున్న నేరగాళ్లు

జల్సాల కోసం ఒకరు.. విలాసాల కోసం మరొకరు.. ప్రేయురాళ్ల కోరికలను తీర్చడానికి ఇంకొకరు అన్నట్టుగా నేరగాళ్లు బైక్ చోరీల బాట పడుతున్నారు. సెంట్రల్ జోన్‌ను టార్గెట్ చేసుకుని, ఆ జోన్ పరిధిలో బైక్‌లు కనిపిస్తే చాలు మాయం చేస్తున్నారు. పొరుగు జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చి రెక్కీలు నిర్వహించుకుంటున్నారు. అనంతరం కంటికి కనిపించిన బైక్‌ను అక్కడి నుంచి మాయం చేస్తున్నారు. ద్విచక్రవాహనాలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను టార్గెట్ చేసుకుని నేరగాళ్లు వ్యవహారాలు నడుపుతున్నారు. విజయవాడలో 13 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. కొన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎక్కువగా సెమీ కల్చర్ ఉండే ప్రాంతాలు ఉంటాయి. ఈ ప్రాంతాలను నేరగాళ్లు ఎంపిక చేసుకుంటున్నారు. ఇటీవల సీసీఎస్ పోలీసులు, పటమట పోలీసులు వాహనాల చోరీ కేసుల్లో కొంతమంది నిందితులను అరెస్టు చేశారు. వాళ్లంతా గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చి చోరీలు చేసినట్టు గుర్తించారు.

చోరీల నియంత్రణకు ఏం చేయాలంటే..

- పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో రద్దీగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలి
- అన్ని పోలీస్‌స్టేషన్లలో క్రైం విభాగాన్ని బలోపేతం చేయాలి.. జైళ్ల నుంచి వస్తున్న నేరగాళ్లపై నిరంతర నిఘా కొనసాగించాలి

(విజయవాడ/ఆటోనగర్, ఆంధ్రజ్యోతి): నగరంలో చాలా ప్రాంతాల్లో వాహనదారులు తమ వాహనాలను ఇంటి బయట నిలిపి ఉంచుతారు. వీధుల్లో ఇళ్లన్నీ పక్కన పక్కనే ఉండడం, ఇంటి లోపల పార్కింగ్ ప్రదేశం లేకపోవడంతో వీధిలో వరుసగా ఇళ్ల ముందు వాహనాలను నిలుపుతారు. ఇక రైతుబజార్లు, శుభకార్యాలు జరిగినప్పుడు కల్యాణ మండపాల్లో ద్విచక్రవాహనాలు ఎక్కువగా ఉంటాయి. బజార్లకు వచ్చేవారు కొనుగోళ్ల హడావుడిలో, కల్యాణ మండపాల్లో శుభకార్యాలకు వెళ్లిన వారు కార్యక్రమాల సందడిలో ఉంటారు. ఇలాంటి ప్రాంతాలను టార్గెట్ చేసుకుని చోరీలు చేస్తున్నారు. వివిధ జిల్లాల నుంచి బస్సుల్లో వచ్చిన నేరగాళ్లు పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఉంటున్నారు. రాత్రి అక్కడే పడుకుని ఉదయం రెక్కీకి వెళ్తున్నారు. చోరీకి అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని నిర్ధారించుకున్నాక వాహనాలను మాయం చేస్తున్నారు. వాహనాలకు నంబరు ప్లేట్లు మార్చి వేర్వేరు వ్యక్తులకు అమ్మేస్తున్నారు. ఒక్కో బైక్ నాలుగైదు చేతులు మారుతోంది. కొన్ని చోరీ కేసుల్లో సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను తీసుకెళ్లి పోలీసులకు అందజేస్తున్నా పరిష్కారం కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుటేజీల్లో స్పష్టత లేకపోవడంతో నిందితులను సరిగ్గా గుర్తించలేకపోతున్నామని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

గంజాయి విక్రయదారులకు బైక్‌లు ఇచ్చి..

నేరాల ద్వారా డబ్బులు సంపాదించి విలాసాలకు అలవాటు పడిన నేరగాళ్లు ఆ బాట నుంచి బయటకు రావడం లేదు. కొంతమంది నేరగాళ్లు బైక్‌లను నేరుగా ఉత్తరాంధ్రలోని మన్యం ప్రాంతానికి తీసుకెళ్తున్నారు. అక్కడ గంజాయి విక్రయించేవారికి ఈ బైక్‌లు ఇచ్చేసి గంజాయిని తెచ్చుకుంటారు. కొద్దినెలల క్రితం టాస్క్‌ఫోర్స్ పోలీసులు నగరంలో గంజాయి బ్యాచ్‌ను ఏరేసే క్రమంలో పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఒడిసా సరిహద్దుల్లోని కొండ ప్రాంతాల్లో దొంగిలించిన బైక్‌లను తాకట్టు పెట్టారని, ఆ బైక్‌లను కొండల నుంచి కిందికి తీసుకురావడానికి నానాపాట్లు పడాల్సి వచ్చిందని పోలీసులు చెబుతున్నారు. ఒక్క సెంట్రల్ జోన్‌లోనే గడచిన ఏడాది 128 బైక్‌లు చోరీకాగా, ఈ ఏడాది 85 బైక్‌లు మాయమ్యాయి.



గన్నవరం విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతున్న ముప్పాళ్ల సర్పంచ్ వీరమ్మ

రాష్ట్రపతి అవార్డుతో

బాధ్యత మరింత పెరిగింది

» ముప్పాళ్ల సర్పంచ్ కుసుమరాజు వీరమ్మ

గన్నవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి నుంచి ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకోవటంతో బాధ్యత మరింత పెరిగిందని ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్ల సర్పంచ్ కుసుమరాజు వీరమ్మ అన్నారు. ముప్పాళ్ల గ్రామ పంచాయతీ రాష్ట్రపతి అవార్డుకు ఎంపికవడంతో సర్పంచ్ వీరమ్మ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలో ఉత్తమ పంచాయతీ అవార్డును అందుకుని శుక్రవారం ఇండిగో విమానంలో గన్నవరం విమానాశ్రయానికి విచ్చేశారు. ఆమెకు గ్రామస్థులు స్వాగతం పలికారు. ఇప్పటికే తమ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని సర్పంచ్ వీరమ్మ తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో పంచాయతీలు ఉన్నా, తమ పంచాయతీ ఎంపికవడం, అవార్డు అందుకోవటం సంతోషంగా ఉందన్నారు. రూ.కోటి తమ పంచాయతీ ఖాతాలో జమయ్యాయని, మరిన్ని వసతులు గ్రామంలో కల్పిస్తామని తెలిపారు. గ్రామ ప్రజలకు కల్పిస్తామని తెలిపారు. ఉపసర్పంచ్ నల్ల రవి, పంచాయితీ కార్యదర్శి సాయిరాం పాల్గొన్నారు.

విదర్భకు విజయం

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బీసీసీఐ పర్యవేక్షణలో మూలపాడు వేదికగా నిరహించిన విజయ్ మర్చంట్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో జమ్మూ, కశ్మీర్‌పై విదర్భ టీమ్ 204 పరుగులతో జయకేతనం ఎగురవేసింది. కర్ణాటక-ఝార్కండ్ మ్యాచ్ డ్రా అయ్యింది. విదర్భ-జమ్మూ, కశ్మీర్ మ్యాచ్‌లో విదర్భ టీమ్ 409/7 పరుగులు చేసింది. జమ్మూ, కశ్మీర్ టీమ్ తొలి ఇన్నింగ్స్‌లో 56కు ఆలౌటైంది. ఫాలోఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్‌లో పేలవమైన ఆటతో 149 పరుగులకు కుప్పకూలి పరాజయం పాలైంది. విదర్భ బౌలర్ కుష్‌శర్మ 23.5 ఓవర్ల బౌలింగ్ చేసి 49 పరుగులిచ్చి ఏడు వికెట్లతో సత్తా చాటాడు. కర్ణాటక-ఝార్కండ్ మ్యాచ్‌లో ఝార్కండ్ తొలి ఇన్నింగ్స్‌లో 387 పరుగులకు ఆలౌట్ కాగా, కర్ణాటక భారీ స్కోర్‌తో చివరి రోజున 441/4 పరుగుల వద్ద నిలవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ టోర్నీలో తొలి ఇన్నింగ్స్‌లో రెండు జట్లు 800కు పైగా పరుగులు చేయడంతో రెండో ఇన్నింగ్స్‌కు అవకాశం లేకుండా పోయింది. కర్ణాటక బ్యాటర్లు ధ్రువ్‌కృష్ణన్(122), అయాజ్‌గౌడ(104) సెంచరీలతో కదం తొక్కారు.



ఏడు వికెట్లు తీసిన విదర్భ బౌలర్ కుష్ శర్మ



భవానీలు వేచి ఉండేందుకు సిద్ధమవుతున్న షెడ్లు

భవానీ దీక్షల విరమణకు ఏర్పాట్లు

వన్‌టౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న భవానీ దీక్షల విరమణలకు ఏర్పాట్లు వేగవంతంగా సాగుతున్నాయి. భవానీలకు ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో కె.ఎస్.రామరావు ఆధ్వర్యంలో అన్ని విభాగాల అధికారులు ఏర్పాట్లు, భద్రతా చర్యల్లో నిమగ్నమయ్యారు. ఆలయ ప్రాంగణంతో పాటు, ముఖ్య ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. భవానీలు వేచి ఉండేందుకు కనకదుర్గానగర్‌లో ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. భవానీల దీక్షల విరమణ సందర్భంగా కనకదుర్గానగర్, మహామండపం సమీపంలో మూడు హోమగుండాలు ఏర్పాటు చేస్తున్నారు. దుర్గాఘాట్, పద్మావతి ఘాట్, సీతమ్మవారి పాదాలు, తదితర ఘాట్లలో ప్రత్యేక షవర్లు ఏర్పాటు చేస్తున్నారు.

కనకదుర్గమ్మకు కానుకగా మంగళసూత్రాలు



కనకదుర్గమ్మ అలంకరణ నిమిత్తం 25 గ్రాముల బంగారు మంగళసూత్రాలను విశాఖపట్నం హెచ్‌బీ కాలనీకి చెందిన ఎ.వి.శ్రీనివాస్ కానుకగా అందజేశారు. శుక్రవారం ఆలయానికి కుటుంబసభ్యులతో కలిసి విచ్చేసి, అధికారులను కలిసి కానుకను అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాన్ని అధికారులు అందజేశారు. వేద పండితులు ఆశీస్సులు అందించారు.

దుర్గగుడిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రిపై శుక్రవారం భక్తుల రద్దీ ఏర్పడింది. అమ్మవారి దర్శనం కోసం వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. భక్తులు పలు ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు.



అథ్లెట్ లోకేశ్‌ను సత్కరిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర ఛైర్మన్ కోటేశ్వరరావు

ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు

● అథ్లెట్ లోకేశ్‌కు శాప్ ఛైర్మన్ రవినాయుడు అభినందన

విజయవాడస్పోర్ట్సు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని, సాధించాలనే తపన ఉంటే ఏదైనా సాధ్యమని అథ్లెట్ లోకేశ్ విభిన్న ప్రతిభావంతుల యూత్ గేమ్స్-2024లో సత్తా చాటి నిరూపించాడని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. థాయ్‌లాండ్‌లో ఈనెల 1 నుంచి 7 వరకు నిర్వహించిన పోటీల్లో హైజంప్‌లో స్వర్ణం, లాంగ్ జంప్‌లో రజతం సాధించిన లోకేశ్‌ను గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలిసి శాప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన అభినందించారు. లోకేశ్ భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. శాప్ నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. పారా స్పోర్ట్సు క్రీడాకారులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో స్నానానికి దిగి బాలుడి మృతి

విజయవాడ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి కృష్ణానదిలో స్నానానికి వెళ్లిన ఓ బాలుడు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. కృష్ణలంక భ్రమరాంబపురానికి చెందిన ముక్కాల మణికంఠ(14) ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. నలుగురు స్నేహితులతో కలిసి స్వర్గపురి వైపు నుంచి కృష్ణానదిలోకి వెళ్లాడు. రిటైనింగ్ వాల్ పక్క నుంచి ఇసుకతిన్నెలు ఉండడంతో సరదాగా నడుచుకుంటూ అర కిలోమీటరు ముందుకు వెళ్లారు. అక్కడ నీరు ఉండడంతో స్నానం చేద్దామని నిర్ణయించుకున్నారు. మిగిలిన స్నేహితులు దిగకపోవడంతో మణికంఠ ఒక్కడే నీళ్లలో దిగాడు. ఎంతసేపటికి పైకి రాకపోవడంతో స్నేహితులు ఇంటికి వచ్చి సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు వెళ్లి చూడగా మణికంఠ మునిగిపోయాడు. కృష్ణలంక పోలీసులు ఈతగాళ్లతో మణికంఠ మృతదేహాన్ని బయటకు తీయించారు. దీనిపై ఫిర్యాదు చేయడానికి తల్లిదండ్రులు ముందుకు రాలేదు. తర్వాత పోలీసులు వారికి విషయాన్ని వివరించి ఫిర్యాదు తీసుకున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.630

స్వర్ణాంధ్ర విజన్-2047కు తరలిన రైతులు

గుడివాడ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో శుక్రవారం జరిగిన సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్ - 2047 కార్యక్రమానికి గుడివాడ, గుడ్లవల్లేరు, నందివాడ మండలాల రైతులు శుక్రవారం తరలివెళ్లారు. వ్యవసాయ శాఖ తరఫున బస్సుల్లో రైతులను తరలించారు. ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో రైతులు తరలివెళ్లారు.





ఆలయశుద్ధి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చలసాని

వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుమంజనం

గుడివాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవాల సందర్భంగా శుక్రవారం కోయిల్ అళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) చేపట్టారు. చలసాని ఇందిర రమణరావు, ఆలయ కార్యనిర్వహణా ధికారి కె.వి గోపాలరావు అండాళ్ అమ్మ వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ శుద్ధి కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ వ్రతాలు

గుడ్లవల్లేరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ దత్తత ఆలయం రెడ్డిపాలెం అభయాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకాలు, సహస్ర నాగావళి (తమల పాకుల దళార్చన, సామూహిక హనుత్ వ్రతాలు నిర్వహించారు. ఈవో ఆకుల కొండలరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు ముస్తాబవుతున్న చర్చిలు

తోట్లవల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పండుగకు చర్చిలు ముస్తాబవుతున్నాయి. చర్చిలకు రంగులు వేయటం, విద్యుద్దీపాలను అలంకరించటం, క్రీస్తు జననానికి గుర్తుగా ఉండే (నక్షత్రం) స్టార్‌లను అందంగా ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.

రెవెన్యూ సదస్సులో సమస్యల గోడు

చిరుచింతలలో నాలుగు అర్జీలు

గుడివాడ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిరుచింతల గ్రామంలో రైతుల నుంచి నాలుగు దరఖాస్తులు వచ్చాయని, మూడు దరఖాస్తులను గ్రామంలోనే పరిష్కరించామని తహసీల్దార్ రామకోటేశ్వరరావు తెలిపారు. చిరుచింతల, రామచంద్రపురం గ్రామాల్లో శుక్రవారం గ్రామ రెవెన్యూ సదస్సులు జరిగాయి. రైతులకు న్యాయం చేయటానికి తమ వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఆర్ఐ నాగబాబు, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

పాములపాడులో..

పెదపారుపూడి: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వై.రంగారావు శుక్రవారం అన్నారు. పాములపాడు సచివాలయం వద్ద తహసీల్దార్ అర్జీలు స్వీకరించారు. రీ సర్వే డీటీ సుందరరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో మీనా, దేవదాయ శాఖ మండల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శిరీష, దగాని లెనిన్, రైతులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు, వేముగుంట గ్రామాల రెవెన్యూ సదస్సును శుక్రవారం గుడ్లవల్లేరు పంచాయితీ కార్యాలయంలోని కొసరాజు బాపయ్య చౌదరి సభావేదికలో నిర్వహించారు. రైతులు మూడు అర్జీలు సమర్పించారు. 22 ఏ జాబితా నుంచి తన భూమిని చూపుతున్నారని రైతు అభ్యర్థించారు. మరో రెండు అర్జీలు రీ సర్వే చేయించాలని కోరారు. తహసీ ల్దార్ లోకరాజు, సర్వేయర్ పర్వీన్ సుల్తానా, మాజీ సర్పంచ్ చాపరాల బాలాజీ, వీఆర్వో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

1262 రకం ధాన్యం అమ్మకానికి తంటాలు

● పండించిన రైతులకు తప్పని అవస్థలు ● పమిడిముక్కల మండలంలో అధికంగా సాగు

పమిడిముక్కల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పండించిన పంట అమ్ముకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. 1262 రకం ధాన్యం స్థానికంగా కొనేవారులేక దూరంగా ఉన్న జిల్లాలకు అయిన కాడికి అమ్ముకోవలసిన పరిస్థితుల్లో రైతులు నష్టపోతున్నారు. ఈరకం ధాన్యానికి గత సంవత్సరం మంచి ధర పలికిన నేపథ్యంలో ఈ సంవత్సరం కూడా ఎక్కువ ధర ఉంటుందన్న ఉద్దేశంతో మండలంలోని కపిలేశ్వరపురంతో పాటు పలు గ్రామాల్లో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేశారు. పంట సమృద్ధిగా పండి ధాన్యం మంచి దిగుబడి రాగా, కొనేవారు లేక దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. పొరుగురాష్ట్రంలో సన్న ధాన్యానికి బస్తాకు రూ.500 ప్రోత్సాహక ధర ఇస్తుంటే, మన రాష్ట్రంలో ప్రోత్సాహం ఇవ్వకపోవడం పట్ల ఆందోళన చెందుతున్నారు. 1262 రకం ధాన్యం చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాలకు వెళుతున్నట్టు సమాచారం.



కపిలేశ్వరపురంలో ఆరబెట్టిన 1262 రకం ధాన్యం

1262 రకం పండించి పాట్లు పడుతున్నాం

1262 రకం ధాన్యం పండించి అమ్ముకునేందుకు నానా తంటాలు పడుతున్నాం. గత సంవత్సరం మంచి ధర ఉందని ఈ సంవత్సరం కూడా పండిస్తే కొనేవారులేక అగచాట్లు పడుతున్నాం. 15 ఎకరాల వరకు ఈ రకం ధాన్యం పండించాను. మిల్లర్లు తీసుకునేందుకు ముందుకు రాకపోవడంతో దూరంగా చిత్తూరు జిల్లా వరకు పంపుతున్నారు. 41.2 కేజీలు సంచుల్లో నింపి 40 కేజీలకే లెక్క కడు తున్నారు. తరుగు సాకుతో కేజీ 200 గ్రాముల వరకు ధాన్యం సంచుల్లో నింపుతుంటే రైతులు నష్టపోతున్నారు. - లంకా పున్నయ్యబాబు, రైతు, కపిలేశ్వరపురం

కష్టాలు తీర్చే నాథుడు లేరు



అందరి చేతుల్లో నష్టపోయేది రైతులే. పంట పండిన దగ్గర నుంచి అమ్ముకునే వరకు నష్టపోయేది రైతే. కూలి రేట్లు ఆకాశనంటుతున్నాయి. 1262 రకం ధాన్యం పండించిన రైతుల తిప్పలు దేవుడెరుగు. సన్నరకం ధాన్యాన్ని టీడీపీ ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి

- లంకా రామకృష్ణ, రైతు,కపిలేశ్వరపురం

రాష్ట్రస్థాయి కౌశల్‌కు మున్సిపల్ పాఠశాల విద్యార్థులు

గుడివాడ, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి) : భారతీయ విజ్ఞానమండలి ప్రతి ఏటా నిర్వహించే సైన్స్ టాలెంట్ టెస్ట్ (కౌశల్)లో జిల్లా స్థాయి విజేతలుగా నిలిచిన గుడివాడ పురపాలక పాఠశాలల విద్యార్థులు ఈనెల 30న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్విజ్‌లో, ఏకేటీపీ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ జాస్మిన్, ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి వై.సురేంద్ర, రీల్స్ విభాగంలో ఏకేటీపీ విద్యార్థిని వి.ఆకాంక్ష రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విజేతలను గుడివాడ డీవైఈవో ఐ.పద్మారాణి, ప్రధానోపాధ్యాయలు పి.ఎల్.నరసమాంబ, ఎం.ఉమామహేశ్వరరావు అభినందించారు.

నేడు విద్యుత్ కోత

గుడివాడ : పట్టణ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.మేదర బజారు, నెహ్రూచౌక్, పాత మున్సిపల్ కార్యాలయం, భాస్కర్ థియేటర్, సత్యనారాయణపురం, వాణిసదన్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు.

నీటిసంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

గుడివాడ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎనిమిది సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. మండలంలోని తట్టివర్రు గ్రామ ఎంపీయూపీ పాఠశా లలో శనివారం ఎన్నికలు జరుగుతాయి. తట్టివర్రు సంఘానికి 2115 మంది ఓటర్లు, సెరిగొల్వేపల్లికి 2280, మోటూరు 1554 ఓటర్లు, వలివర్తిపాడు 1138 మంది, రామన్నపూడి 11269 మంది, చౌటపల్లి 543 మంది, చౌటపల్లి -1 488 మంది ఆయా పాఠశాలల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవటానికి ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ రామ కోటేశ్వరరావు ఏర్పాట్లు పరిశీలించారు. ఉదయం నుండే పోలింగ్ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు జరిగాయని ఆయన తెలిపారు. నందివాడ : నీటి సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ మల్లిక తెలిపారు. శనివారం ఉదయం 7 గంటలకు పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ అధికారులు ఉంటారన్నారు. 8 గంటలకు ఓటింగ్ ప్రారంభమవుతుందన్నరు. ఆర్ఐ గణేష్ పోలింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. తోట్లవల్లూరు : పెనమకూరు, వల్లూరుపాలెం సాగునీటి వినియోగదారుల సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్ధార్ ఎం కుసుమకుమారి తెలిపారు.పెనమకూరు హైస్కూల్లో ఏర్పాట్లను తహసీల్ధార్ పరిశీలించారు. ఉదయం 7.30 గంటల నుండి నామినేషన్‌లు తీసుకుంటారని, 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం 3 నుండి 5 గంటల మధ్య ఫలితాలు వెల్లడి ఉంటుందన్నారు. పెనమకూరు నీటి సంఘం కింద పెనమకూరు, చాగంటిపాడు, దేవరపల్లి, అమీనాపురం, పత్తేలంక, మేడూరు, కుమ్మమూరు, సౌత్‌వల్లూరు, కనకవల్లి, యాకమూరు, చిన ఓగిరాల గ్రామాల రైతులు ఓటర్లుగా ఉన్నారు. సుమారు 3,057 మంది ఓటర్లు పెనమకూరు సంఘంలో ఉన్నారు. వల్లూరుపాలెం నీటి సంఘం కింద రొయ్యూరు, వల్లూరుపాలెం, చినపులిపాక, నార్త్‌వల్లూరు, సౌత్‌వల్లూరు, చాగంటిపాడు, దేవరపల్లి, గుర్విందపల్లి రైతులు ఓటర్లుగా ఉన్నారు. పామర్రు : మండల పరిధిలో సాగునీటి వినియోదారుల సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినటు తహసిల్దార్ గూడపాటి రవికాంత్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. . పూర్తి పారదర్శకతతో ఎన్నికల నిర్వహణ జరిగేలా అందరూ సహకరిచాలని కోరారు. మండల ఎన్నికల అధికారి రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



పెనమకూరు జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ కుసుమకుమారి, సిబ్బంది

నూతన సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలి

గుడివాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్ది దశ నుండే సమయం నిర్వహణను అలవాటు చేసుకోవాలని, కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని ఆస్ట్రేలియా సాఫ్ట్‌వేర్ టెక్ లీడ్ జి.శ్రీనివాస్ అన్నారు. అక్కినేని నాగేశ్వరరావు కళాశాల ఎంసీఏ విభాగం ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతికాలు అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే కృత్రిమ మేథ, డేటా సైన్సు డేటా అనలిటిక్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషిన్ లెర్నింగ్ వంటివి నేర్చుకోవాలన్నారు. అనంతరం శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్‌కె ప్రసాద్, కెవిఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ .పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, ఎంసీఏ విభాగాధిపతి సి.హెచ్ మల్లిక, అధ్యాపకులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న టెక్ లీడ్ శ్రీనివాస్

కనుమూరు సర్పంచ్ సుఖవేణి మృతి



పామర్రు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కనుమూరు సర్పంచ్ కోడాలి సుఖవేణి (55) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. భర్త, ముగ్గురు సంతానం ఉన్నారు. కనుమూరు గ్రామ అభివృద్ధికి సర్పంచ్‌గా తనవంతు తోడ్పాటునందించారు. మండల, గ్రామ టీడీపీ నేతలతోపాటు గ్రామపంచాయతీ కార్యాలయ సిబ్బంది సుఖవేణి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పేదలు, దివ్యాంగులను ఆదుకోవాలి



గుడివాడ, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి) : పేదలు, దివ్యాంగులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని టూటౌన్ సీఐ సి.హెచ్ నాగప్రసాద్ కోరారు. చౌదరిపేటలోని శిరీష రిహాబిలిటేషన్ సెంటర్‌లోని దివ్యాంగులకు శ్రీకృష్ణయాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హరికుమార్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. ముఖ్య అతిథిగా టూటౌన్ సీఐ నాగప్రసాద్ హాజరయ్యారు. వలపర్ల వెంకటేశ్వరరావు, సయ్యద్ గఫార్, జబీన్, కరీముల్లా, తిరుపతయ్య, హరిబాబు, మునీంద్ర, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం

గుడివాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రణావా శ్రమం, గుడివాడ డెంటల్ ఆసుపత్రిలో శుక్రవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఐదు గురికి డాక్టర్ రవి కుమార్‌రెడ్డి, మరో ఆరుగురికి డాక్టర్ అనుదీప్ తమ సొంత నిధులతో వైద్యం చేయిం చారు. క్లబ్ అధ్యక్షుడు టి.ఎన్ రాజశేఖర్, ప్రణావాశ్రమం స్థైర్య చైతన్యానంద సరస్వతి, క్లబ్ పూర్వ అధ్యక్షులు పొన్నూరు రామకృష్ణ, ఎం.రమణమూర్తి, డాక్టర్ మలిరెడ్డి రవికుమార్‌రెడ్డి, కార్యదర్శి జి.కిరణ్‌బాబు, కోశాధికారి నరహరిశెట్టి ప్రసాద్, సభ్యులు ప్రసాద్, మారుతికుమార్, ఎన్.వరప్రసాద్, వి.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం విజయవాడ రూరల్ మండలం టీడీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరక్షరాస్యుల నుండి పీజీ వరకు నిరుద్యోగులకు వారి అర్హతలను బట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.

జీతాలు ఇప్పించాలి

ఉయ్యూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆరునెలలుగా జీతాలు రాక ఇబ్బంది పడుతున్న మాకు జీతాలు ఇప్పించాలని ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు, వాచ్‌మెన్‌లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌ను కలసి మొరపెట్టుకున్నారు. మండల పరిధిలో ప్రభుత్వప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల స్వీపర్లు, వాచ్‌మెన్‌లు శుక్రవారం రాజేంద్ర ప్రసాద్‌ను కలిసి జీతాలు ఇప్పించే ఏర్పాట్లు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఆ మేర జిల్లా విద్యాశాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడి జీతాలిప్పించాలన్నారు.

కూచిపూడి స్టేట్ బ్యాంకులో డిపాజిట్ మిషన్ ప్రారంభం

కూచిపూడి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి భారతీయ స్టేట్ బ్యాంక్ కార్యాలయంలో ఎనీటైమ్ డిపాజిట్, విత్ డ్రాయల్ మిషన్ సేవలను రీజినల్ మేనేజర్ ఎస్.సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. బ్యాంక్ పని చేయని సమయాల్లో కూడా లావాదేవీలు (డిపాజిట్, విత్ డ్రాయిల్స్) నిర్వహించుకునే అవకాశం ఖాతదారులకు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ డి.హెచ్.వి.వి.ఎస్.ఎస్.ఎస్.నాగకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



మిషన్‌ను ప్రారంభించిన ఆర్ఎం సుబ్రహ్మణ్యం

గౌడ కార్పొరేషన్ చైర్మన్‌గా గురుమూర్తి ప్రమాణస్వీకారం నేడు

తోట్లవల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్‌గా విజయవాడ బెంజిసర్కిల్ వద్ద లారీ ఓనర్స్ అసోసియేషన్ ఫంక్షన్ హాలులో శనివారం ఉదయం 10.30 గంటలకు పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు వీరంకి వెంకట గురుమూర్తి శుక్రవారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గౌడ సంఘీయులు, అభిమానులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. గౌడ సంఘీయుల సంక్షేమం కోసం కృషి చేసి పార్టీ అభివృద్ధికి తోడ్పాటు అందించటమే తన కర్తవ్యమని గురుమూర్తి తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.630

మంత్రి రవీంద్రకు టీడీపీ నేతల పరామర్శ



కోడూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సోదరుడి వియోగానికి గురైన మంత్రి కొల్లు రవీంద్రను కోడూరు టీడీపీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. వెంకట రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బండే శ్రీనివాసరావు, పిల్లి మల్లిఖార్జునరావు, కోటయుంధర్, మేడా శివాజీ, అప్పికట్ల రవీంద్రబాబు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, అద్దంకి రవి, బండే వెంకటేశ్వరరావు, గోగినేని సోమశేఖరరావు పాల్గొన్నారు.

పల్లెల్లో నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బందరు పరిధిలో శనివారం 13 నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. గుండుపాలెం నీటి సంఘానికి జిల్లా పరిషత్ హైస్కూల్, రుద్రవరం నీటి సంఘానికి ఎంపీయూపీ స్కూల్, ఎస్ఎన్ గొల్లపాలెం నీటి సంఘానికి జడ్పీ హైస్కూల్, బందరు ఈస్ట్ నీటి సంఘానికి మచిలీపట్నం రాంజీ హైస్కూల్, బందరు వెస్ట్ నీటి సంఘానికి కాలేఖాన్‌పేట మునిసిపల్ హైస్కూల్, అరిసేపల్లి నీటి సంఘానికి చిట్టిపాలెం జడ్పీ హైస్కూల్, బుద్దాలపాలెం నీటి సంఘానికి జడ్పీ హైస్కూల్, పోతిరెడ్డిపాలెం నీటి సంఘానికి మండల పరిషత్ పాఠశాల, తాళ్లపాలెం నీటి సంఘానికి వి.కానూరు జిల్లా పరిషత్ హైస్కూల్, చిన్నాపురం నీటి సంఘానికి జడ్పీ హైస్కూల్, కోన నీటి సంఘానికి జిల్లా పరిషత్ హైస్కూల్, పెదయాదర నీటి సంఘానికి ఎంపీయూపీ పాఠశాల, వాడపాలెం నీటి సంఘానికి ఎంపీయూపీ పాఠశాలల్లో పోలింగ్ జరుగుతుంది.

జనసేనకు రెండు సంఘాలు

నీటి సంఘాల ఎన్నికలకు పొత్తు కుదిరింది. మచిలీపట్నం పరిధిలోని 13 సంఘాలకు గాను చిన్నాపురం, పోతిరెడ్డిపాలెం సంఘాలను జనసేన కు కేటాయించారు. మంత్రి కొల్లు రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణలకు జరిగిన చర్చల్లో చిన్నాపురం నీటి సంఘాన్ని చలమలశెట్టి వెంకటేశ్వరరావు, పోతిరెడ్డిపాలెం నీటి సంఘాన్ని శాయన శివయ్య నామినేషన్ దాఖలు చేసేందుకు నిర్ణయించారు. టీడీపీ అభ్యర్థులు ఖరారయ్యారు. ఉదయం 9 గంటలకు తమ నామినేషన్లు దాఖలు చేయనున్నారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు కుంచే నాని, తలారి సోమశేఖర్, లంకే హరికృష్ణ పాల్గొన్నారు.



వాడపాలెంలో నీటి సంఘాల ఎన్నికలకు చేసిన ఏర్పాట్లు

నాగాయలంక మండలంలో..

నాగాయలంక : మండలంలోని తొమ్మిది సాగునీటి సంఘాలకు శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.హరనాథ్ తెలిపారు. నంగేగడ్డ, భావదేవరపల్లి, కమ్మనమోలు, ఈలచెట్లదిబ్బ, ఏటిమొగ, టి.కొత్తపాలెం, తలగడదీవి, పర్రచివర, ఎదురుమొండి సాగునీటి సంఘాలకు ఆయా గ్రామాల్లోని పాఠశాలలో ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికలకు మండల స్థాయి అధికారులను నియమించగా, బందోబస్తును పోలీసులు పర్యవేక్షిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

ఘంటసాల మండలంలో..

ఘంటసాల : మండలంలో సాగునీటి సంఘ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. శ్రీకాకుళం, చి ట్టూర్పు, మల్లాయిచిట్టూర్పు, పాపవినాశనం, లంకపల్లి, ఘంటసాల గ్రామాల పరిధిలోని సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగనున్నాయి.శ్రీకాకుళం నీటి సంఘానికి సగ్గున రాంబాబు (జనసేన), పాపవినాశనం బోయిన నాగేంద్రరావు (తెలుగుదేశం), ఘంటసాల నుంచి అయినపూడి భాను ప్రకాష్ (టీడీపీ) చిట్టూర్పు నుంచి దాసరి సతీష్ (టీడీపీ), లంకపల్లి నుంచి పరిశె చలపతి (టీడీపీ), మల్లాయి చిట్టూరు నుంచి ఆవుల ధర్మ వెంకట నరసయ్య (జనసేన) అధ్యక్ష బరిలో నిలుచున్నారు. ఆరు సంఘాలు ఏకగ్రీవం అయ్యేలా నేతలు చర్చలు జరుపుతున్నారు.

నీటి పారుదల రంగాన్ని క్రమబద్ధీకరిస్తాం : లుక్కా

మచిలీపట్నం టౌన్ : నీటి సంఘాల ఎన్నికలు జరిపి నీటి పారుదల రంగాన్ని క్రమబద్ధీకరిస్తామని మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు లుక్కా సాయి రామ్‌ప్రసాద్ అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు నీటి సంఘాల ఎన్నికలు జరుపుతున్నారన్నారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, రూరల్ పార్టీ అధ్యక్షుడు కుంచే దుర్గాప్రసాద్, టీడీపీ నాయకులు లంకే శేషగిరి, తలారి సోమశేఖర్, వక్కపట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ మండలంలో..

అవనిగడ్డ రూరల్ : మండలంలో మూడు సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు తెలిపారు. మోదుమూడిలో 2304, అశ్వారావుపాలెం 2125, వేకనూరు 1778 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఓటు హక్కు కలిగిన వారు ఉదయం తొమ్మిది గంటల లోపు కేంద్రానికి రావాలని కోరారు.

కోడూరు మండలంలో..

కోడూరు : మండల పరిధిలోని ఎనిమిది నీటి సంఘాలకు ఎన్నికలు శనివారం ఉదయం జరుగనున్నట్లు తహసీల్దార్ శ్రీను నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వి.కొత్తపాలెం, విశ్వనాథపల్లి, సాలెంపాలెం, కోడూరు -1, కోడూరు -2, ఉల్లిపాలెం, రామ కృష్ణాపురం నాగాయలంక డీసీకి సంబంధించి మండపాకల నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు.

పైడమ్మ జాతర ఉత్సవ కమిటీ నియామకం
అమ్మవారు ఆలయ ప్రవేశం రేపు

పెడన, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పైడమ్మతల్లి జాతర ప్రారంభం కానుండటంతో ఎనిమిది మంది సభ్యులతో ఉత్సవ కమిటీని నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తోట రామారావు, పత్తిపాటి జయకృష్ణ, మల్లంపల్లి శ్రీనివాసరావు, కోమట్ల సాంబశివరావు, బొల్లా ఎల్లారమ్మ, గోకవరపు పద్మావతి, కోరుమిల్లి ఝాన్సీ, కొండ్రు వడ్డికాసులు ఉత్సవ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. బందరులో రంగుల అలంకరణ పూర్తి చేసుకున్న పైడమ శనివారం ఉదయంఊరేగింపుగా బయలుదేరి రాత్రికి పెడన పట్టణంలోకి ప్రవేశిస్తారు. పుట్టింటి, అత్తింటి పూజలందుకున్న అనంతరం ఆదివారం ఉదయం ఆలయంలోకి ప్రవేశిస్తారు. జాతర ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ అబ్దుల్ సుభాన్ విజ్ఞప్తి చేశారు.



రైతుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీవిద్య

రెవెన్యూ సదస్సులు సద్వినియోగపర్చుకోండి

మోపిదేవి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : భూముల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగపర్చుకోవాల్సిందిగా తహసీల్దార్ ఎం.శ్రీవిద్య తెలిపారు. మోపిదేవిలంక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సులో రైతుల అర్జీలను ఆమె స్వీకరించారు. గ్రామసర్పంచ్ మోర్ల జ్యోత్స్న, సర్వేయర్ రామకృష్ణ, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన

మోపిదేవి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ ఆధ్వర్యంలో నాగాయితిప్ప అంకమ్మ ఆలయం వద్ద శుక్రవారం సామూహిక కుంకుమార్చన జరిగింది. నాలుగు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో రామాయణం, భగవద్గీత శ్లోకాల పఠనం, ప్రవచన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం గ్రామానికి చెందిన 110 మంది మహిళలచే సామూహిక కుంకుమార్చన, టీటీడీ జిల్లా కో-ఆర్డినేటర్ సీవీకే ప్రసాద్ పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీటీడీ ధర్మాచార్యులు గరికపాటి వీరాంజనేయులు, విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు బసవ శంకరరావు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



వైభవంగా దివ్యజ్యోతి మహోత్సవం

అవనిగడ్డ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అరుణాచలంలో దివ్యజ్యోతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని రాజశేఖర స్వామి ఆలయంలో ప్రపంచ ఆర్యవైశ్య సభ అవనిగడ్డ విభాగం, ఆర్యవైశ్య మహిళా సంఘాల నేతృత్వంలో శుక్రవారం రాత్రి కర్పూర జ్యోతి వైభవంగా నిర్వహించారు. అవనిగడ్డ ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద అరుణాచలేశ్వర స్వామిని స్మరించుకుంటూ కర్పూర జ్యోతిని వెలిగించారు. ఆర్యవైశ్య సంఘ పెద్దలు చన్నగిరి మల్లికాంబ, కొల్లిపర రాధాకృష్ణ, విస్సంశెట్టి శ్రీనివాస్, దేసు శేషు, కోడూరు పవన్ తదితరులు పర్యవేక్షించారు.

లంకమ్మ అమ్మవారికి పసిడి నెక్లెస్



అవనిగడ్డ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దివి ప్రాంత వాసుల ఇలవేల్పు లంకమ్మ అమ్మవారికి విజయవాడలో స్థిరపడిన వేమూరి ఆంజనేయ ప్రసాద్ దంపతులు శుక్రవారం బంగారు నెక్లెస్ అందజేశారు. 15.87 గ్రాముల ఆభరణాన్ని దేవస్థానం పాలక మండలికి అందజేశారు.

హనుమత్, గాయత్రీ హోమం

అవనిగడ్డ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ వంతెన సెంటర్ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో శు క్రవారం నవగ్రహ హనుమత్, గాయత్రీ హోమాన్ని గోపీనాథ్ అర్చకత్వంలో వైభవం గా నిర్వహించారు. స్వామివారి వ్రతాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అయ్యప్పక్షేత్రంలో పడిపూజా ఉత్సవాలు

చల్లపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిమ్మలతోట శ్రీహరిహర పుత్ర అయ్యప్పస్వామి క్షేత్రంలో అష్టమ వార్షిక మహాపడిపూజా మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అంకురార్పణ, ఆల య వ్యవస్థాపకులు అన్నవర పు పాండురంగారావు గురుస్వామి చే ధ్వజారోహణ, లక్ష్మీగణపతి సహిత నవగ్రహ హోమం, గణపతి దేవాలయ ఉత్సవ కార్యక్ర మాలు జరిగాయి. గర్భాలయంలోని అయ్యప్పస్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భాను నంబూద్రిచే పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ పెద్దలు, స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

నాగమల్లేశ్వరమ్మకు కాగిత, కొనకళ్ల నివాళి

పెడన, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కౌన్సిలర్ అనుముల నాగమల్లేశ్వరమ్మ భౌతికకాయానికి ప్రముఖులు శ్రద్ధాంజలి ఘటించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, మునిసిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైస్‌చైర్మన్ ఎండి ఖాజా, మాజీ చైర్‌పర్సన్ బొడ్డు పద్మజాకుమారి, కమిషనర్ ఎం. గోపాలరావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య తదితరులు ఆమె భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె భర్త పూర్ణచంద్రరావును పరామర్శించారు. మంగమ్మచెరువు హిందూ శ్మశాన వాటికలో నాగమల్లేశ్వరమ్మ భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.



నాగమల్లేశ్వరమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కాగిత, కొనకళ్ల

కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజల సంతృప్తి : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలకు వాస్తవాలు తేటతెల్లమవుతున్నాయని, కూటమి ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజలు సంతృప్తితో ఉన్నారని మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. రైతులు, మహిళా సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పాత సబ్ స్టేషన్‌లో మురమ్మతుల కారణంగా అవనిగడ్డలో కొంత మేరకు, పులిగడ్డ, మోదుమూడి, అశ్వారావుపాలెం, రామచంద్రపురం, సౌత్ చిరువోలులంక గ్రామాలు, నాగాయలంక రోడ్‌లో గల కొత్త సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు డీఈఈ డి.కృష్ణ నాయక్ ఒక ప్రకటనలో తెలియజేశారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏటిమొగలో..

నాగాయలంక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఏటిమొగ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలు ఏటిమొగ, పెదకమ్మవారిపాలెం, చిన్నకమ్మవారిపాలెం, పెదలపాలెం, గుల్లలమోద, ఎదురుమొండి దీవుల గ్రామాలకు శనివారం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నారు. ఏటిమొగ 33 కెవి లైన్ మీద ఉన్న చెట్ల కొమ్మలు తొలగించుట, పోల్స్ మరమ్మతులు చేయనున్న దృష్ట్యా మూడు గంటల పాటు విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

ఇంధన పరిరక్షణ దినోత్సవం

అవనిగడ్డ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంధన పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. నావిగేషన్ అండ్ ఎంబెడెడ్ కంప్యూటర్స్ డీఆర్‌డీవో ఆర్‌సీఐడీ సిహెచ్.విజయ శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై క్షిపణి నిర్మాణంలో ప్రాథమిక అంశాలు, సాంకేతిక మార్పులు, భారతీయ శాస్త్ర సాంకేతిక విజ్ఞాన రంగంలో క్షిపణి శాస్త్రం సాధించిన ప్రగతిని వివరించారు. భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ వై.ఎస్.సిహెచ్.రవిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ .డి.ఉమారాణి, జి.జ్యోతిర్మయి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్ 19న

అవనిగడ్డ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19వ తేదీన రెవెన్యూ భవనంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఉయ్యూరు డీఈఈ డి.కృష్ణ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, మీటరు సమస్యలు, బిల్లుల సమస్యలు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఇతర అన్ని సమస్యలు పరిష్కరిస్తారని తెలియజేశారు.

యువతకు ప్రోత్సాహం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : యువత ప్రతిభను వెలికి తీసేందుకు కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని టీడీపీ ఫ్లోర్ లీడర్ మరకాని సమతాకీర్తి అన్నారు. నోబుల్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఆమె ట్రోఫీని అందజేసింది. టీడీపీ ఫ్లోర్ లీడర్ మరకాని సమతాకీర్తి, కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్, టీడీపీ రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు హసీంబేగ్ తదితరులు పాల్గొన్నారు.

కోడూరులో పూరిల్లు దగ్ధం

కోడూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కోడూరు ఐదో వార్డులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆకురాతి సాంబయ్య పూరి గుడిసెలో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమయింది. రూ.20 వేల నగదు, గృహోపకరణాలు, బట్టలు పూర్తిగా దగ్ధమయ్యాయి. కూలి పని చేసుకుని జీవనం సాగించే సాంబయ్య నిరాశ్రయుడిగా మిగిలాడు.



తాళ్లపాలెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో స్వాతి

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతు సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు దోహదపడుతున్నాయని ఆర్డీవో స్వాతి అన్నారు. తాళ్లపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. రైతులు అర్జీలు సమర్పించారు. పట్టాదారు పాసుపుస్తకాలు, అడంగల్‌లో పేర్ల మార్పు, పింఛన్ల దరఖాస్తులు ఆర్డీవోకు అందజేశారు. తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేరాయన్నారు. జొన్నల బాబూరావు, కొక్కిలిగడ్డ జయకృష్ణ పాల్గొన్నారు. కోన గ్రామంలో జరిగిన రైతు సదస్సులో తహసీల్దార్ మధుసూదనరావు పాల్గొని రైతుల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు.



వైభవంగా హనుమత్ వ్రతాలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పరాసుపేటలోని ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో శుక్రవారం హనుమత్ వ్రతాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి టి.వి.వి.మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సీసీ రోడ్డు పనుల ప్రారంభంలో కూటమి నాయకులు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చల్లపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో గ్రామాలు సమగ్ర అభివృద్ధి సాధిస్తున్నాయని మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి పథకం నిధులు రూ.3.80 లక్షలతో చల్లపల్లి నారాయణరావునగర్‌లో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారిలతో కలిసి రాంబాబు ప్రారంభించారు. పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, ఈవో పివి.మాధవేంద్రరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ తోట కనకదుర్గ, జనసేన నేతలు బొందలపాటి వీరబాబు, సూదాని నందగోపాల్, మిరియాల జితేంద్ర, టీడీపీ నేత జాబీర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు సత్కారం



బంటుమిల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత పెన్షనర్స్ డే సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల భవనంలో శుక్రవారం పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా చండిక గంగాజలరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా పరసా పద్మనాభరావు, ఉపాధ్యక్షులుగా కాళింగ దైవకుమార్, సింహాద్రి అప్పారావు, జనరల్ సెక్రటరీగా జోస్యుల భాస్కరరావు, ఆర్గనైజర్ సెక్రటరీగా పెదశింగు నేతాజీ, సెక్రటరీగా కూనసాని జగన్మోహనరావు, కనగాల ఘంటయ్య, కోశాధికారిగా కొట్టే నాగభూషణం, డైరెక్టర్లుగా చిన్నాపురపు సత్యనారాయణ, గోపిశెట్టి నంది కేశవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

చల్లపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం కృష్ణా జిల్లా 25వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు పిలుపునిచ్చారు. గుంటూరు బాపనయ్య భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 15, 16, 17 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు చల్లపల్లిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15వ తేదీ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు చల్లపల్లిలోని అమర వీరుల స్థూపం నుంచి ప్రధాన సెంటరు వరకు భారీ ప్రజాప్రదర్శన, సాయంత్రం నాలుగు గంటలకు ఏటీఎం సెంటరులో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు.అమరవీరుల జ్ఞాపకార్థం అమరుల ప్రభలు, కళారూపాలతో ప్రదర్శనగా పార్టీ శ్రేణులు పాల్గొంటారన్నారు. బహిరంగ సభలో ముఖ్య అతిథులుగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు ఎస్.పుణ్యవతి, రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు, వి.ఉమా మహేశ్వరరావు వై.వెంకటేశ్వరరావు తదితర నాయకులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. 16, 17 తేదీలలో స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో 200 మందితో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు, మండల పార్టీ కార్యదర్శి యద్దనపూడి మధు, సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, వెనిగళ్ల వసంతరావు పాల్గొన్నారు.